PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

## విద్యా రంగానికి బలమైన పునాది వేసిన ఆజాద్




## ఆరోపణల సెగ.. జీఈసీఓ భాద్యతల నుంచి గాయత్రి ఔట్




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 319 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- గురువారం 12 నవంబర్ 2026

# ముస్లిం రిజర్వేషన్లపై బీజేపీ ద్వంద్వ వైఖరి

**- బీజేపీ నేతలకు సీఎం రేవంత్‌రెడ్డి సూటి సవాల్ - తెలంగాణలో రిజర్వేషన్ల రద్దు మాటలు చెబుతూ గుజరాత్‌లో ఎందుకు కొనసాగిస్తున్నారు?**

**- కమలంతో ప్రాంతీయ పార్టీలు రాజీ.. బీజేపీతో కాంగ్రెస్‌ది నిరంతర పోరాటం ఢిల్లీలో మోడీ గల్లీలోకి వెళ్లగానే గులాబీ కాస్తా కమలంగా మారుతోంది: సీఎం ఎద్దేవా**



**హైదరాబాద్,నవంబర్ 11 (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో అమల్లో ఉన్న ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామంటూ ప్రకటనలు చేస్తున్న బీజేపీ నేతలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సూటి ప్రశ్న సంధించారు. బీజేపీకి నిజంగా ధైర్యం ఉంటే ఆ పార్టీ అధికారంలో ఉన్న గుజరాత్‌లో అమలవుతున్న ముస్లిం రిజర్వేషన్లను తొలగించాలని సవాల్ విసిరారు. తెలంగాణలో ముస్లిం రిజర్వేషన్లపై మాట్లాడుతున్న బీజేపీ నేతలు గుజరాత్ విషయంలో ఎందుకు మౌనంగా ఉంటున్నారని నిలదీశారు. మతోన్మాద బీజేపీతో కొన్ని ప్రాంతీయ పార్టీలు రాజీపడుతున్నాయని, కాంగ్రెస్ మాత్రం ఆ పార్టీతో నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.తెలంగాణ ఉర్దూ అకాడమీ, తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ (టీజీఎంఆర్ఈఐఎస్) సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీల సంక్షేమ దినోత్సవ కార్యక్రమంలో సీఎం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశంలో మెజారిటీ, మైనారిటీ వర్గాల సంక్షేమం, భద్రత కాంగ్రెస్ ప్రభుత్వాలతోనే సాధ్యమని పేర్కొన్నారు.రాష్ట్రానికి పర్యాటకుల్లా వచ్చే బీజేపీ జాతీయ నాయకులు.. తెలంగాణలో తమ పార్టీ అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లను తొలగిస్తామని ప్రజలను భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. మిగతా2లో...

## జాతీయ స్థాయిలో మెరిసిన జీహెచ్ఎంసీ

**- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారం స్వీకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్**



**హైదరాబాద్,నవంబర్ 11 (పీసీడబ్ల్యూ న్యూస్):** స్వచ్ఛ సర్వేక్షణ్ 202526 జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) జాతీయ పురస్కారాన్ని అందుకుంది. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం మిగతా2లో...




## విద్యారంగానికి ప్రభుత్వ ప్రాధాన్యం

**కాజీపేటలో రూ.10 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన**

**ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ విద్యార్థులకు సమాన విద్యావకాశాలు: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

# హైడ్రా కమిషనర్‌కు హైకోర్టు ఆదేశాలు


**కోర్టు ధిక్కరణ కేసులో నవంబర్ 17న హాజరుకావాలని స్పష్టం.. రంగనాథ్‌తో పాటు శంషాబాద్ తహసీల్దార్‌ను తీసుకురావాలని డీజీపీకి ఆదేశం**



**హైదరాబాద్,నవంబర్ 11 (పీసీడబ్ల్యూ న్యూస్):** హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ధిక్కరణ కేసు విచారణకు వ్యక్తిగతంగా హాజరుకాకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన న్యాయస్థానం.. ఆయనను నవంబర్ 17న కోర్టు ముందు హాజరుపరచాలని రాష్ట్ర డీజీపీని ఆదేశించింది. రంగనాథ్‌తో పాటు శంషాబాద్ తహసీల్దార్ అమర్ లింగంను కూడా హాజరుపరచాలని స్పష్టం చేసింది.కోర్టు గతంలో సమన్లు జారీ చేసినప్పటికీ అధికారులు విచారణకు హాజరుకాకపోవడాన్ని హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. మిగతా2లో...

## రేపు ఏపీ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

**- మూడు విడతల్లో ఎన్నికలు.. నవంబర్ 26, 29, డిసెంబర్ 2న పోలింగ్**




## రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

**పంట పాలాలకు నీరు నిలిపేశారు.. ఇతర రాష్ట్రాలకు కరువు బృందాలు.. తెలంగాణకు మొండి చేయి చూపిన కేంద్రం**

**8 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలు ఉండి ఏం లాభం?**

**ప్రధాని మోదీ ఇంటి ఎదుట బైఠాయించి ధర్నా చేయాలి: నిర్మల్ రైతు గర్జన సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**నిర్మల్,నవంబర్ 11 (పీసీడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే కరువు కాటకాలు వచ్చాయని, అసమర్థ పాలనతో తెలంగాణ ప్రజల సంక్షేమం ఆగమవుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు కరువు బృందాలను పంపి తెలంగాణకు పంపకుండా మొండిచేయి చూపిందని ఆరోపించారు. బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన రైతు గర్జన సభలో ఆయన ప్రసంగించారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, సంక్షేమ కార్యక్రమాలను నిలిపివేసిందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పెండింగ్‌లో పెట్టారని, ఆరు నెలల్లో ఉద్యోగులకు పీఆర్సీ ఇస్తామని చెప్పి అమలు చేయలేదని కేటీఆర్ అన్నారు. మిగతా2లో...

## హైదరాబాద్‌కు పూర్వ వైభవం

**చెరువుల నగరంగా హైదరాబాద్ పాత గుర్తింపును పునరుద్ధరిస్తాం.. భవిష్యత్ తరాల కోసం జలవనరుల పరిరక్షణ: సీఎం రేవంత్‌రెడ్డి**







## సమ్మక్క బ్యారేజీకి కొత్త డీపీఆర్ రూపొందించాలి

**ఆయకట్టు వివరాలు పూర్తిగా సేకరించాలని కేంద్ర జలసంఘం సూచన**

**అధికారులకు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశం**

## ఈ నెల 14న గిగ్ కార్మికుల భారీ ర్యాలీ

- **హైదరాబాద్‌లో శిల్పకళా వేదిక నుంచి హెచ్ఐసీసీ వరకు ప్రదర్శన.. పాల్గొననున్న రాహుల్‌గాంధీ**



# ముస్లిం రిజర్వేషన్లపై బీజేపీ ద్వంద్వ వైఖరి

(మొదటి పేజీ తరువాయి)

అలాంటి ప్రకటనలు చేసే నేతలు ముందుగా గుజరాత్‌లో ముస్లింలకు అమలవుతున్న రిజర్వేషన్లపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పేదలకు ఓటు హక్కు కల్పించడాన్ని రాజ్యాంగ రచన సమయంలోనే కొందరు వ్యతిరేకించారని, అయితే కాంగ్రెస్ అందరికీ ఓటు హక్కు కల్పించిందని గుర్తుచేశారు.**బీఆర్ఎస్ మాట తప్పింది** తెలంగాణలో ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి రెండుసార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ఆ హామీని నెరవేర్చకుండా మోసం చేసిందని సీఎం విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీకి వ్యతిరేకమని చెప్పుకునే బీఆర్ఎస్.. ఢిల్లీకి వెళ్లగానే బీజేపీతో సఖ్యతగా వ్యవహరిస్తోందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో గులాబీ పార్టీగా కనిపించే బీఆర్ఎస్.. ఢిల్లీలో మోడీ గల్లీలోకి వెళ్లగానే కమలంలా మారిపోతోందని వ్యాఖ్యానించారు. పాతబస్తీకి మెట్రో రైలు విస్తరణ విషయంలోనూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు.**మైనారిటీ విద్యార్థుల ఉపకార వేతనాలు నిలిపివేత** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మైనారిటీ విద్యార్థులకు అందించే ఉపకార వేతనాలను నిలిపివేయడంపై రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పాతబస్తీ విద్యార్థులు, మైనారిటీ పిల్లలు ఏం పాపం చేశారని ప్రశ్నించారు. ఏ మతంలో పుట్టాలనేది ఎవరి చేతుల్లో ఉండదని, మతం ఆధారంగా వివక్ష చూపడం హేయమైన చర్య అని అన్నారు. దేశ జనాభాలో మైనారిటీలు సుమారు 15 శాతం ఉన్నారని, వారి అభివృద్ధిని విస్మరిస్తే దేశం సమగ్ర అభివృద్ధి సాధించలేదని పేర్కొన్నారు.మక్కాకు వెళ్లే యాత్రికులపై కేంద్రం అదనంగా రూ.10 వేలు చెల్లించేలా ఆదేశాలు తీసుకొచ్చినప్పుడు పేద ముస్లింలపై భారం పడకుండా ఆ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించిందని తెలిపారు. అన్ని మతాల ప్రజలను కాంగ్రెస్ సమానంగా చూస్తుందని, మైనారిటీల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

మూడేళ్ల పాలనలో ఎవరికి న్యాయం చేశారో ప్రజలు గమనించాలని సూచించారు. బీడీ పరిశ్రమపై జీఎస్టీ విధించిన సమయంలో ఆ పరిశ్రమకు అండగా నిలిచిన నాయకుడు కేసీఆర్ అని గుర్తుచేశారు. నిర్మల్ జిల్లాలోనే 63 వేల మంది బీడీ కార్మికులకు పెన్షన్లు అందించినట్లు తెలిపారు.**రైతు హామీలను నెరవేర్చలేదు** రైతు డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, మూడేళ్లు గడిచినా వాటిని నెరవేర్చలేదని కేటీఆర్ విమర్శించారు. వరి పంటకు మద్దతు ధరతో పాటు రూ.500 అదనపు బోనస్ ఇస్తామని చెప్పి ఏ ఒక్క పంటకూ ఇవ్వలేదన్నారు. మూడు విడతలుగా రైతుబంధు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. రైతులకు సాగునీరు, విద్యుత్ నిలిపివేశారని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందడం లేదని విమర్శించారు. యాసంగి పంటకు దుక్కి దున్నొద్దని, విత్తనం చల్లొద్దని చెబుతూ ప్రభుత్వం రైతులతో స్వీయ ప్రకటనలు రాయిస్తోందని అన్నారు.**కేంద్రంపై ఒత్తిడి తేవాలి**నిర్మల్ జిల్లాలో తొమ్మిది మండలాలను కరువు మండలాలుగా ఎలా ప్రకటించారని కేటీఆర్ ప్రశ్నించారు. గోదావరి నది ఒడ్డున, ఎస్ఆర్ఎస్పీ వంటి ప్రాజెక్టులు ఉన్న జిల్లాలో కరువు పరిస్థితులు రావడంపై ప్రభుత్వాన్ని నిలదీశారు. కడెం ప్రాజెక్టు కింద సాగునీరు నిలిపివేసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఒక్క పైసా కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఇతర రాష్ట్రాలకు కరువు బృందాలు వెళ్లి తెలంగాణకు రాకపోతే రాష్ట్రంలోని ఎనిమిది మంది బీజేపీ ఎమ్మెల్యేలు, ఎనిమిది మంది ఎంపీలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రానికి న్యాయం జరిగేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని, అవసరమైతే ప్రధాని మోదీ ఇంటి ఎదుట బైఠాయించి ధర్నా చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, నాయకులు జాన్సన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగానికి ప్రభుత్వ ప్రాధాన్యం

**వరంగల్, నవంబర్ 11 (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య అందించి, ప్రపంచ స్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో కాజీపేటలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రూ.10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవనానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. విద్య ద్వారానే సమాజ సమగ్ర అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాల విద్యార్థులందరికీ సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు అనుమతులు ఇచ్చామని, ఒక్కో పాఠశాలను 20 నుంచి 25 ఎకరాల్లో సుమారు రూ.200 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ పాఠశాలల్లో ఒకటి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఆంగ్ల మాధ్యమంలో విద్య, ఆధునిక సదుపాయాలు, విద్యార్థులు, సిబ్బందికి వసతి కల్పిస్తామని వివరించారు. అన్ని సామాజిక వర్గాల పిల్లలు ఒకే ప్రాంగణంలో చదువుకోవడం ద్వారా సమానత్వం, సామాజిక సమైక్యత పెంపొందుతాయని చెప్పారు.ప్రతి శాసనసభ నియోజకవర్గంలో ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు విద్యతో పాటు డిజిటల్ బోధన, ఆధునిక తరగతి గదులు, శిక్షణ పొందిన ఉపాధ్యా యులు, రవాణా సదుపాయాలు కల్పిస్తామన్నారు. విద్యార్థులకు యూనిఫామ్‌లు, పుస్తకాలు, బ్యాగులు, బూట్లు ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని సుమారు 27 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయం అల్పాహార పథకం అమలు చేస్తున్నామని భట్టి తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కేంద్రీకృత వంటశాలల ద్వారా పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కుడా చైర్మన్ గుండు సుధారాణి, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, పోలీస్ కమిషనర్ శ్వేత తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌కు పూర్వ వైభవం

**హైదరాబాద్,నవంబర్ 11 (పీసీడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ నగరానికి చెరువుల నగరంగా ఉన్న పూర్వ వైభవాన్ని తిరిగి తీసుకురావడమే తన సంకల్పమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. నగరంలోని చెరువులను పునరుద్ధరించి భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మాదాపూర్‌లో పునరుద్ధరించిన తమ్మిడికుంట చెరువును బుధవారం ప్రారంభించనున్న సందర్భంగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.తమ్మిడికుంట చెరువును సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. గతంలో ఆక్రమణలు, ఇతర కారణాలతో చెరువు విస్తీర్ణం తగ్గిపోయిందని, హైడ్రా ఆధ్వర్యంలో ఆక్రమణలను తొలగించి పూడికను తీసి పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. చెరువు పరిసరాల్లో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, పిల్లల ఆట స్థలం, పచ్చదనం వంటి సదుపాయాలను ఏర్పాటు చేశారు. **ఇప్పటికే మూడు చెరువుల పునరుద్ధరణ**హైదరాబాద్‌లో ఇప్పటికే నల్లచెరువు, బతుకమ్మకుంట, బం-రుక్నుద్దౌలా చెరువులను పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సీఎం తెలిపారు. తమ్మిడికుంట నాలుగో చెరువుగా అందుబాటులోకి రానుంది. మరికొన్ని చెరువుల పనులు పూర్తయిన వెంటనే వాటిని కూడా ప్రజలకు అంకితం చేస్తామని చెప్పారు.నగరంలో గతంలో 1,372 చెరువులు ఉండగా, దాదాపు సగం చెరువులు కనుమరుగయ్యాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. చెరువుల ఆక్రమణల వల్ల వర్షాకాలంలో కాలనీలు, రహదారులు ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. జలవనరులను కాపాడితేనే నగరాన్ని వరదల నుంచి రక్షించగలమని స్పష్టం చేశారు.

**నాగార్జునకు సీఎం అభినందనలు**

తమ్మిడికుంట అభివృద్ధికి సినీనటుడు అక్కినేని నాగార్జున స్వచ్ఛందంగా రెండు ఎకరాల భూమిని ప్రభుత్వానికి అప్పగించడంపై సీఎం అభినందనలు తెలిపారు. చెరువుల పరిరక్షణకు ప్రజలు, రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. మూసీ నది పునరుజ్జీవన పనులను కూడా త్వరలో ప్రారంభిస్తామని, ఈ ప్రాజెక్టు వల్ల ఎవరికీ నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దడంతోపాటు చెరువుల ఆధారంగా ఆర్థిక, పర్యాటక కార్యకలాపాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# ఎరువుల రాయితీకి రూ.62,370 కోట్లు

**● రబీ సీజన్ 202627కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం..**

**గత సీజన్‌తో పోలిస్తే 64 శాతం పెంపు**

**న్యూఢిల్లీ,నవంబర్ 11 (పీసీడబ్ల్యూ న్యూస్):** రబీ సీజన్ 202627కు సంబంధించి ఫాస్ఫేటిక్, పొటాషిక్ (పీ అండ్ కే) ఎరువులపై రూ.62,370.02 కోట్ల రాయితీకి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. గత రబీ సీజన్‌లో ఈ రాయితీ కోసం రూ.37,952.29 కోట్లు కేటాయించగా, ఈసారి అదనంగా రూ.24,417.73 కోట్లు పెంచారు. అంటే గత ఏడాదితో పోలిస్తే సుమారు 64 శాతం పెంపు జరిగింది.అంతర్జాతీయ మార్కెట్‌లో ఎరువులు, ముడిసరుకుల ధరల్లో వచ్చిన మార్పుల నేపథ్యంలో రైతులకు అందుబాటు ధరల్లో ఎరువులు సరఫరా చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం వెల్లడించింది. డీఏపీ, ఎన్‌పీకేఎస్ తదితర రకాల ఎరువులకు ఈ రాయితీ వర్తించనుంది. 2026 అక్టోబర్ 1 నుంచి 2027 మార్చి 31 వరకు ఆమోదించిన రాయితీ ధరలు అమల్లో ఉంటాయి.**రైతులకు అందుబాటు ధరల్లో ఎరువులు** పోషక ఆధారిత రాయితీ పథకం (ఎన్‌బీఎస్) కింద ఫాస్ఫేటిక్, పొటాషిక్ ఎరువులపై ప్రభుత్వం రాయితీ అందిస్తోంది. ప్రస్తుతం డీఏపీతో సహా 28 రకాల పీ అండ్ కే ఎరువులను ఈ పథకం ద్వారా రైతులకు అందుబాటులో ఉంచుతున్నారు. ఎరువుల తయారీదారులు, దిగుమతిదారులకు ఆమోదించిన రేట్ల ప్రకారం రాయితీ చెల్లించనున్నారు. తద్వారా రైతులకు ఎరువుల సరఫరాలో అంతరాయం లేకుండా చూడటంతో పాటు ధరలను అందుబాటులో ఉంచాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. **డీఏపీ ధరపై ప్రత్యేక వెసులుబాటు** 50 కిలోల డీఏపీ బస్తా ధరను రూ.1,350 వద్ద కొనసాగించే ప్రత్యేక ఏర్పాటును కూడా కేంద్రం కొనసాగించనుంది. అంతర్జాతీయంగా ఎరువుల ధరలు పెరిగినప్పటికీ రైతులపై అదనపు భారం పడకుండా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్రం తెలిపింది. రష్యాఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ సరఫరా వ్యవస్థపై ప్రభావం పడటంతో ఎరువుల ధరలు పెరిగాయి. ఈ నేపథ్యంలో రాయితీ పెంపు ద్వారా రైతులకు కొంత ఉపశమనం కల్పించాలని కేంద్రం నిర్ణయించింది.



# రేపు ఏపీ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

**అమరావతి,నవంబర్ 11 (పీసీడబ్ల్యూ న్యూస్):**ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. ఎన్నికల షెడ్యూల్‌ను నవంబర్ 13న విడుదల చేయనున్నట్లు సమాచారం. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలకు మీడియా సమావేశం నిర్వహించి ఎన్నికల వివరాలను వెల్లడించనున్నారు.రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు. తొలి విడతకు నవంబర్ 13న, రెండో విడతకు నవంబర్ 16న, మూడో విడతకు నవంబర్ 19న నోటిఫికేషన్లు జారీ చేయనున్నారు. ఆయా విడతల్లో నవంబర్ 26, నవంబర్ 29, డిసెంబర్ 2 తేదీల్లో పోలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ రోజే ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన కూడా ఉండనుంది.**మూడు విడతల్లో ఎన్నికల ప్రక్రియ** తొలి విడతలో నామినేషన్ల స్వీకరణకు నవంబర్ 17 చివరి తేదీగా నిర్ణయించారు. రెండో విడతకు నవంబర్ 20, మూడో విడతకు నవంబర్ 23 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత అభ్యర్థుల తుది జాబితాలను ప్రకటిస్తారు.**13,219 పంచాయతీలకు ఎన్నికలు** రాష్ట్రంలో 13,219 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది, పోలింగ్ కేంద్రాలు, భద్రతా ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలతో గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ సందడి మొదలుకానుంది. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల కోసం ఆశావహులు సిద్ధమవుతున్నారు.

# జాతీయ స్థాయిలో మెరిసిన జీహెచ్ఎంసీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రభాకర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ అవార్డును స్వీకరించారు. **10,500 మార్కులతో మూల్యాంకనం** కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా నిర్వహించిన ఈ సర్వేలో పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ, ఘన వ్యర్థాల శుద్ధి, మురుగునీటి నిర్వహణ, ప్రజల భాగస్వామ్యం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. మొత్తం 10,500 మార్కులతో పది ప్రధాన విభాగాల్లో నగరాల పనితీరును అంచనా వేశారు. 2026 ఏప్రిల్, మే నెలల్లో హైదరాబాద్‌లో క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహించి పారిశుద్ధ్య సదుపాయాలు, చెత్త నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ, ప్రజాభిప్రాయాలను మూల్యాంకనం చేశారు.**గతంలోనూ జాతీయ గుర్తింపులు** స్వచ్ఛతలో జీహెచ్ఎంసీ గతంలోనూ పలు గుర్తింపులు సాధించింది. 2017లో ఓడీఎఫ్ హోదా, 2019లో ఓడీఎఫ్++ గుర్తింపు, 2021లో వాటర్ ప్లస్ ధ్రువీకరణ పొందింది. 2024 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పది లక్షలకు పైగా జనాభా ఉన్న నగరాల విభాగంలో హైదరాబాద్ ఆరో ర్యాంకు సాధించింది. 2023లో ఐదు నక్షత్రాలు, 2024లో ఏడు నక్షత్రాల చెత్త రహిత నగర గుర్తింపులు లభించాయి.**ఇతర మున్సిపాలిటీలకు మార్గదర్శనం** స్వచ్ఛ షెహర్ జోడీ కార్యక్రమంలో భాగంగా మంథని, చేర్యాల మున్సిపాలిటీలకు జీహెచ్ఎంసీ మార్గదర్శక సంస్థగా వ్యవహరిస్తోంది. పారిశుద్ధ్య ప్రమాణాల మెరుగుదలకు శిక్షణ కార్యక్రమాలు, సామర్థ్య పెంపు శిబిరాలు నిర్వహిస్తోంది. ఈ జాతీయ గుర్తింపు నగర ప్రజలు, అధికారులు, పారిశుద్ధ్య కార్మికుల కృషికి దక్కిన గౌరవమని అధికారులు పేర్కొన్నారు.

# హైడ్రా కమిషనర్‌కు హైకోర్టు ఆదేశాలు

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని రంగనాథ్, తహసీల్దార్ దాఖలు చేసిన పిటిషన్లను న్యాయస్థానం కొట్టివేసింది. తదుపరి విచారణకు వారిద్దరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించింది.**భూమి కూల్చివేతపై కోర్టు ధిక్కరణ పిటిషన్** శంషాబాద్ ప్రాంతంలోని సుమారు తొమ్మిది ఎకరాల భూమికి సంబంధించిన వివాదంలో కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి నిర్మాణాలను కూల్చివేశారంటూ మహమ్మద్ తాజాముల్లుద్దీన్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా హైకోర్టు తాజా ఆదేశాలు జారీ చేసింది. నవంబర్ 17న జరిగే తదుపరి విచారణలో అధికారులు హాజరుకావాల్సి ఉంది.

# ఈ నెల 14న గిగ్ కార్మికుల భారీ ర్యాలీ

**హైదరాబాద్, నవంబర్ 11 (పీసీడబ్ల్యూ న్యూస్):**గిగ్ కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం ఈ నెల 14న హైదరాబాద్‌లో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి వెల్లడించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఈ ర్యాలీలో పాల్గొని కార్మికులతో సమావేశమవుతారని తెలిపారు. శిల్పకళా వేదిక నుంచి హెచ్ఐసీసీ వరకు ర్యాలీ కొనసాగుతుందని పేర్కొన్నారు.రాష్ట్రంలో సుమారు ఆరు లక్షల మంది గిగ్ కార్మికులు వివిధ డిజిటల్ వేదికలు, బహుళజాతి సంస్థల్లో పనిచేస్తున్నారని మంత్రి తెలిపారు. ఆహార సరఫరా సిబ్బంది, క్యాబ్ డ్రైవర్లు, ఇతర సేవలందించే కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వారికి ప్రమాద బీమా, సామాజిక భద్రత, కనీస సంక్షేమ సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.**కార్మికుల నమోదు కోసం ప్రత్యేక యాప్** గిగ్ కార్మికుల వివరాల నమోదు, వారి సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలు కోసం ప్రత్యేక మొబైల్ యాప్‌ను తీసుకురానున్నట్లు మంత్రి వెల్లడించారు. తెలంగాణ ప్లాట్‌ఫామ్ ఆధారిత గిగ్ వర్కర్స్ సంక్షేమ చట్టం అమలుకు సంబంధించిన నిబంధనలను సిద్ధం చేశామని తెలిపారు. సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.ఈ ర్యాలీ రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్నామని, కార్మికులు తమ రాజకీయ అనుబంధాలతో సంబంధం లేకుండా పాల్గొనవచ్చని మంత్రి స్పష్టం చేశారు. యాప్‌లో నమోదు చేసుకున్న గిగ్ కార్మికులు ర్యాలీలో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. కార్మికులకు తగిన గుర్తింపు, గౌరవం, భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

# సమ్మక్క బ్యారేజీకి కొత్త డీపీఆర్ రూపొందించాలి

**హైదరాబాద్, నవంబర్ 11 (పీసీడబ్ల్యూ న్యూస్):**

ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద నిర్మిస్తున్న సమ్మక్కసాగర్ బ్యారేజీకి కొత్తగా సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించాలని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) తెలంగాణ ప్రభుత్వానికి సూచించింది. గతంలో సమర్పించిన డీపీఆర్‌లో ఆయకట్టు వివరాలు పూర్తిస్థాయిలో లేవని అభ్యంతరం వ్యక్తం చేస్తూ, అవసరమైన మార్పులు చేసి మళ్లీ సమర్పించాలని తెలిపింది.ప్రాజెక్టు కింద సాగునీరు అందించే ప్రాంతాన్ని వందశాతం సర్వే చేసి వివరాలను ధ్రువీకరించాలని స్పష్టం చేసింది. ఇందుకోసం డ్రోన్లు, లైడార్, జీపీఎస్, జీఐఎస్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించింది. కాలువల నిర్మాణం, భూసేకరణ, నీటి పంపిణీ వ్యవస్థకు సంబంధించిన వివరాలను కూడా డీపీఆర్‌లో పొందుపర్చాలని పేర్కొంది.మరోవైపు, ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) రావాల్సి ఉంది. బ్యారేజీలో నీటి నిల్వతో తమ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశాలపై ఛత్తీస్‌గఢ్ అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ఈ సమస్య పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం ఆ రాష్ట్రంతో చర్చలు జరుపుతోంది.సుమారు రూ.9,257 కోట్ల వ్యయంతో చేపట్టిన సమ్మక్కసాగర్ బ్యారేజీ నిర్మాణ పనులు 95 శాతం పూర్తయ్యాయి. దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాలకు సాగునీరు అందించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. కొత్త డీపీఆర్, ఇతర అనుమతులు పూర్తయిన తర్వాతే ప్రాజెక్టు తదుపరి ప్రక్రియ ముందుకు సాగనుంది.

# విద్యా రంగానికి బలమైన పునాది వేసిన ఆజాద్

### జాతీయ విద్యా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు



**పెద్దపల్లి, నవంబర్ 11 (పీసీడబ్ల్యూ న్యూస్):** భారత విద్యా రంగానికి బలమైన పునాది వేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు అన్నారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన మైనారిటీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 1888 నవంబర్ 11న మక్కాలో జన్మించిన ఆజాద్ స్వాతంత్ర్య సమరయోధుడిగా, గొప్ప పండితుడిగా, రచయితగా దేశానికి సేవలందించారని తెలిపారు. స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా 11 ఏళ్లపాటు పనిచేసి విద్యాభివృద్ధికి విశేష కృషి చేశారని పేర్కొన్నారు. ఐఐటీ, యూజీసీ, సాహిత్య అకాడమీ, సంగీత నాటక అకాడమీ, లలిత కళా అకాడమీ వంటి ప్రముఖ సంస్థల ఏర్పాటుకు ఆయన మార్గదర్శకత్వం వహించారని తెలిపారు. 14 ఏళ్లలోపు పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్య అందించాలని, మహిళా అక్షరాస్యతతో పాటు సాంకేతిక విద్యను ప్రోత్సహించాలని ఆజాద్ ఆకాంక్షించారని వివరించారు. ఆయన సేవలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం నవంబర్ 11న జాతీయ విద్యా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో వ్యాసరచన పోటీలు, చర్చలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఆజాద్ ఆశయాలను విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ అధికారి జి. రవికుమార్, కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాచిగూడలో 'డి-వాఫిల్ కెఫె' 7వ బ్రాంచ్ ప్రారంభం

### - ముఖ్య అతిథిగా హాజరైన అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



**హైదరాబాద్ నవంబర్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రముఖ వాఫిల్ బ్రాండ్ 'డి-వాఫిల్ కెఫె' తన 7వ నూతన బ్రాంచ్‌ను కాచిగూడలో బుధవారం ఘనంగా ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి అంబర్‌పేట్ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కాలేరు వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి నూతన బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ.. యువ పారిశ్రామికవేత్తలు కొత్త ఆలోచనలతో వ్యాపార రంగంలోకి రావడం అభినందనీయమన్నారు. నాణ్యమైన సేవలతో డి-వాఫిల్ కెఫె వినియోగదారుల మనసు దోచుకుంటూ స్వల్పకాలంలోనే 7వ బ్రాంచ్‌ను అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమని పేర్కొన్నారు. సంస్థ మేనేజ్‌మెంట్‌కు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ఫౌండర్ అండ్ సిఈఓ భరత్ గుప్తా, కాచిగూడ బ్రాంచ్ మేనేజింగ్ డైరెక్టర్ అనురాగ్ మాట్లాడుతూ.. వినియోగదారుల ఆదరణ, ప్రోత్సాహంతోనే గూగుల్‌లో 4.9 రేటింగ్‌తో నగరంలోనే ప్రముఖ వాఫిల్ కేఫ్ బ్రాండ్‌గా ఎదిగామని తెలిపారు. తమ సంస్థ ప్రయాణంలో 7వ బ్రాంచ్ ప్రారంభోత్సవానికి విచ్చేసి ఆశీస్సులందించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా కాచిగూడ బ్రాంచ్‌లో రూ. 300 పైబడిన ప్రతి బిల్లుపై ఆకర్షణీయమైన 'స్పిన్ వీల్' పోటీ ద్వారా బహుమతులు పొందే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఆఫర్



ప్రారంభ తేదీ నుంచి 10 రోజుల పాటు అందుబాటులో ఉంటుంది. టైర్-2 నగరాల్లో బ్రాండ్ విస్తరణలో భాగంగా తదుపరి 10 యూనిట్లకు కేవలం రూ. 1 లక్ష ఫ్రాంచైజీ ఫీజుతో ప్రత్యేక అవకాశం కల్పిస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, స్థానిక నాయకులు, వ్యాపారవేత్తలు మరియు పెద్ద సంఖ్యలో వినియోగదారులు పాల్గొన్నారు.

# మున్నూరుకాపుల అభ్యున్నతికి నూతన సంక్షేమ సంఘం



**ఐక్యతే బలం.. అభివృద్ధే లక్ష్యం..**
**రాజ్యాధికారమే గమ్యం!**
**- తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఆర్‌జేసీ కృష్ణ ఏకగ్రీవ ఎన్నిక**
**- విద్య, వైద్యం, ఉపాధి, ఆర్థిక స్వావలంబనకు పెద్దపీట**
**- ఈనెల 15న ప్రకాష్‌నగర్‌లో వన సమారాధన.. ప్రతి ఒక్కరూ పాల్గొనాలి**







**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** మున్నూరుకాపు సమాజం సామాజిక, విద్యా, వైద్యం, ఉపాధి, ఉద్యోగం, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి సాధించడంతో పాటు ప్రతి కుటుంబానికి అండగా నిలవాలనే లక్ష్యంతో ఖమ్మంలో తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు సంక్షేమ సంఘం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. నూతన సంఘం అధ్యక్షుడిగా ఆర్‌జేసీ కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఐక్యత, క్రమశిక్షణ, పారదర్శకత, సమష్టి నాయకత్వంతో సంఘాన్ని బలోపేతం చేస్తామని నూతన నాయకత్వం ప్రకటించింది. ఖమ్మంలోని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో హాస్టల్ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కనకం జనార్దన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు, పెద్దలు, నాయకుల సమక్షంలో ఆర్‌జేసీ కృష్ణను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆర్‌జేసీ కృష్ణ మాట్లాడుతూ.. ఖమ్మం మున్నూరుకాపు సమాజానికి సుదీర్ఘ చరిత్ర, ఘనమైన వారసత్వం ఉందన్నారు. సంఘం అభివృద్ధి కోసం గతంలో కృషి చేసిన మేకల సంగయ్య, మేకల భిక్షమయ్య, కనకం జనార్దన్ తదితర పెద్దల సేవలు చిరస్మరణీయమన్నారు. ప్రభుత్వంతో పోరాడి సంఘం కోసం రెండు ఎకరాల పది కుంటల స్థలాన్ని సాధించిన వారి కృషిని గుర్తుచేశారు. వారి త్యాగాల స్ఫూర్తితో నేటి తరం సంఘాన్ని మరింత అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. సంఘం కేవలం వనభోజనాలు, సమావేశాలకే పరిమితం కాకుండా ప్రతి కుటుంబ జీవితంలో మార్పు తీసుకొచ్చే సంక్షేమ వేదికగా రూపుదిద్దుకోవాలన్నారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్య, స్కాలర్‌షిప్‌లు, కుల ధ్రువీకరణ పత్రాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై మార్గదర్శనం చేయడంతో పాటు ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు సహాయం అందిస్తామన్నారు. నిరుపేద కుటుంబాలకు వైద్య సహాయం, ఆపదలో ఉన్నవారికి ఆర్థిక భరోసా, మహిళలకు స్వావలంబన అవకాశాలు, యువతలో నాయకత్వ లక్షణాల పెంపొందింపునకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. సంఘం ఎవరికీ పోటీగా కాదని, గతంలో పనిచేసిన నాయకులు, పెద్దలను గౌరవిస్తూ అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. సంఘ ఆస్తులను పరిరక్షిస్తూ వాటిని సమాజ అభివృద్ధికి వినియోగిస్తామన్నారు. ఇతర బీసీ కుల సంఘాలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ ఐక్యంగా ముందుకు సాగుతామని చెప్పారు. విద్య, ఉపాధి, సామాజిక న్యాయంతో పాటు బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరగాలని, రాజ్యాధికార సాధన దిశగా అన్ని బీసీ కులాలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఒక కులం అభివృద్ధి మరో కులానికి అడ్డంకి కాకూడదని పేర్కొన్నారు. సంఘ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ లక్కినేని రఘు మాట్లాడుతూ.. మున్నూరుకాపు సామాజిక వర్గానికి జిల్లా స్థాయిలో ఎమ్మెల్యేలు, కీలక చైర్మన్ పదవుల్లో తగిన ప్రాతినిధ్యం లేకపోవడం విచారకరమన్నారు. విద్యావంతులు, ప్రతిభావంతులైన యువతను ప్రోత్సహించాలని సూచించారు. ప్రధాన కార్యదర్శి బచ్చు విజయ్ కుమార్ మాట్లాడుతూ.. గతంలో అసంపూర్తిగా ఉన్న ఫంక్షన్ హాల్ నిర్మాణం, విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా వసతి గృహ విస్తరణపై నూతన సంఘం దృష్టి సారించాలని అన్నారు. ఈ సమావేశంలో ట్రెజరర్ పిన్ని కోటేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాకం శ్యామ్ బాబు, పట్టణ అధ్యక్షుడు కనకం భద్రయ్య, కార్యదర్శి ఎర్ర జ్ఞానేశ్, యువజన విభాగం అధ్యక్షుడు మాటేటి కిరణ్, కోయిల వీరభద్రం, కుమ్మరికుంట్ల సత్యనారాయణ, గుండెపునేని రాజా, డాక్టర్ లక్ష్మి, రాధిక, ఊర్మిళ, బచ్చు మధు, మాడూరి సైదారావు, ఎర్ర అప్పారావు, మాటేటి రవి, రాపర్తి రాజా, నరాల నరేష్ తదితరులు పాల్గొన్నారు. **ఈనెల 15న వన సమారాధన.. అందరికీ ఆహ్వానం** ఈనెల 15వ తేదీ ఆదివారం ప్రకాష్‌నగర్‌లోని కాళ్ల రామారావు తోటలో నిర్వహించనున్న మున్నూరుకాపుల వన సమారాధన కార్యక్రమానికి ప్రతి కుటుంబం హాజరై విజయవంతం చేయాలని ఆర్‌జేసీ కృష్ణ కోరారు. ఈ కార్యక్రమాన్ని సమాజ ఐక్యతకు, భవిష్యత్ అభివృద్ధి కార్యాచరణకు వేదికగా మలుచుకోవాలని పిలుపునిచ్చారు. పెద్దల అనుభవం, యువత ఉత్సాహం, మహిళల భాగస్వామ్యంతో మున్నూరుకాపు సంక్షేమ సంఘాన్ని ఆదర్శవంతమైన సంస్థగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు.

# ఘనంగా ఐక్య క్రిస్మస్ సంబరాలు

### ● డిసెంబర్ 9న కల్లూరులో వేడుకలు.. పోస్టర్ ఆవిష్కరించిన ఏనోష్ కుమార్



**కల్లూరు, నవంబర్ 11 (పీసీడబ్ల్యూ న్యూస్):** కల్లూరులో డిసెంబర్ 9న నిర్వహించనున్న ఐక్య క్రిస్మస్ వేడుకల పోస్టర్‌ను అసోసియేషన్ ఆఫ్ ఇండిపెండెంట్ క్రిస్టియన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రెవ. పి. ఏనోష్ కుమార్ ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు డాక్టర్ టి. ఎబినేజర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏనోష్ కుమార్ మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని కల్లూరులోని శ్రీకృష్ణ మ్యాంగో యార్డ్‌లో డిసెంబర్ 9న సాయంత్రం 6 గంటలకు క్రిస్మస్ సంబరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హెల్పింగ్ హాండ్స్ మినిస్ట్రీస్, కాకినాడ బిషప్ పి. నటరాజన్ లాజరస్ క్రిస్మస్ సందేశం అందించనున్నట్లు వెల్లడించారు. వేడుకల్లో క్రిస్మస్ సంగీత గానాలు, ప్రత్యేక సందేశం, క్యాండిల్ లైట్ సర్వీస్, కేక్ కటింగ్, నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ప్రేమ, శాంతి, సోదరభావం, సేవా గుణాలను చాటిచెప్పే లక్ష్యంతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకలకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, టీజీ ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. క్రైస్తవ సోదరులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని నిర్వాహకులు ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రార్థనా విభాగం అధ్యక్షుడు టి. నిర్మల్ కుమార్, ప్రధాన కార్యదర్శి ధర్నాసి బాలరాజు, మీడియా సెల్ జిల్లా అధ్యక్షుడు దాసరి దేవిడ్ రాజు, ప్రచార కార్యదర్శి దాసరి శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు డాక్టర్ టి. ఎబినేజర్, తేలూరి సంజీవరావు, పి. దయాకర్, జాన్ పరంజ్యోతి, సుందర్ రాజు, గౌడిపేరు జీవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ వ్యవసాయంపై వినూత్న పరిశోధన: బీజేఆర్ కళాశాల బృందానికి ప్రథమ స్థానం




**హైదరాబాద్, నవంబర్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):** నారాయణగూడలోని బాబు జగ్జీవన్ రామ్ ప్రభుత్వ డిగ్రీ (స్వయంప్రతిపత్తి) కళాశాల వృక్షశాస్త్ర విభాగం ప్రతిష్టాత్మక 'జిజ్ఞాస' ప్రాజెక్టుల పోటీల్లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతిని సాధించింది. కళాశాల వృక్షశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ ఈ.ఎం. సునీత నేతృత్వంలోని పరిశోధనా బృందం "మొక్కల ఆధారిత జీవక్షయ ప్లాస్టిక్ రహిత నీటిపీల్చే పదార్థాలు (బయోడిగ్రేడబుల్ హైడ్రోజెల్స్) పట్టణ వ్యవసాయం, నీటి సంరక్షణలో విప్లవాత్మక మార్పులు" అనే అంశంపై ప్రతిపాదించిన వినూత్న పరిశోధనకు ఈ అవార్డు దక్కింది. తెలంగాణ ఉన్నత విద్యా కమిషనర్ కార్యాలయం (సీసీఈ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీ) ప్రొఫెసర్ కోదండరామ్ విజేతలకు బహుమతిని ప్రదానం చేశారు. నేలలో తేమను సుదీర్ఘకాలం నిలిపి ఉంచడం, నీటి వృథాను అరికట్టడం, పర్యావరణహిత పట్టణ వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ పరిశోధన సాగింది. కళాశాల ప్రిన్సిపాల్ కెప్టెన్ ప్రొఫెసర్ ఎం. విజయ్ కుమార్ అందించిన ప్రోత్సాహం, మార్గదర్శకత్వమే ఈ విజయోత్సవానికి మూలకారణమని బృందం తెలిపింది. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ విజేతలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ విజయం కళాశాల పరిశోధనా పటిమకు, పర్యావరణ పరిరక్షణ పట్ల ఉన్న నిబద్ధతకు అద్దం పడుతోందని అధ్యాపక బృందం పేర్కొంది.

# తిమ్మాపూర్‌లో అంగన్‌వాడీ పోస్టుల తాత్కాలిక జాబితా విడుదల

### - అభ్యంతరాలకు ఈ నెల 16 వరకు అవకాశం: ఐసీడీఎస్ అధికారులు

**తిమ్మాపూర్, నవంబర్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):**
తిమ్మాపూర్ మండల పరిధిలోని మన్నెంపల్లి (1), మొగిలిపాలెం (1), అల్గునూర్ (4) గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీకి సంబంధించి అందిన దరఖాస్తుల పరిశీలన పూర్తయినట్లు అధికారులు తెలిపారు. అభ్యర్థులు సమర్పించిన ధ్రువపత్రాలు, అర్హత ప్రమాణాల ఆధారంగా రూపొందించిన అర్హుల, అనర్హుల తాత్కాలిక జాబితాలను సంబంధిత గ్రామాల పంచాయతీ నోటీస్ బోర్డులలో ప్రదర్శించినట్లు వెల్లడించారు. ఈ జాబితాలపై అభ్యర్థులకు ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా, సరియైన ఆధారాలతో కూడిన వినతులను సమర్పించవచ్చని అధికారులు తెలిపారు. నోటీస్ బోర్డులో జాబితా ప్రదర్శించిన తేదీ (11/11/2026) నుండి 6 రోజులలోగా, అంటే ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5:00 గంటలలోపు కరీంనగర్ రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో నేరుగా అందజేయాలని సూచించారు. నిర్ణీత గడువు దాటిన తర్వాత వచ్చిన అభ్యంతరాలను పరిశీలించబోమని అధికారులు స్పష్టం చేశారు.


# ట్రయాథ్లాన్‌లో ప్రతిభ చాటిన నిఖిల్‌ను అభినందించిన ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు జిల్లా నవంబర్11(పిసిడబ్ల్యూ న్యూస్):** గోవాలో నిర్వహించిన ఐరన్‌మ్యాన్ 70.3 ట్రయాథ్లాన్ పోటీల్లో ప్రతిభ చాటిన ములుగు జిల్లా యువకుడు వజ్జా నిఖిల్‌ను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అభినందించారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో నిఖిల్ జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ములుగు మండలం రాయినిగూడెం గ్రామానికి చెందిన నిఖిల్ గోవాలో ఇటీవల నిర్వహించిన ఐరన్‌మ్యాన్ 70.3 ట్రయాథ్లాన్ పోటీల్లో 1.9 కిలోమీటర్ల ఈత, 90 కిలోమీటర్ల సైక్లింగ్, 21.1 కిలోమీటర్ల పరుగును పూర్తి చేసి సత్తా చాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పట్టుదల, క్రమశిక్షణతో కృషి చేస్తే క్రీడల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. నిఖిల్ సాధించిన విజయం జిల్లాలోని యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించి ములుగు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# అటవీ శాఖ కార్యాలయంలో మద్యం మత్తులో అటెండర్

**● విధులకు మద్యం సేవించి వచ్చిన అటెండర్ ● మధ్యాహ్నం వరకు తూలుతూ హల్‌చల్ ● ఉద్యోగి తీరుపై ప్రజల్లో ఆగ్రహం ● అధికారుల పర్యవేక్షణ ఏదీ.?**




**ములుగు నవంబర్ 11 (పీ సి డబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ బాధ్యతగా విధులు నిర్వర్తించాల్సి ఉండగా, ములుగు అటవీ శాఖ కార్యాలయంలో ఇందుకు భిన్నమైన ఘటన చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.జిల్లా అటవీ శాఖ అధికారి అటెండర్ హారీఫ్ మద్యం సేవించి విధులకు హాజరైనట్లు, కార్యాలయంలో తూలుతూ అటూ ఇటూ తిరిగినట్లు పలువురు చెబుతున్నారు.బుధవారం మధ్యాహ్నం 12 గంటల వరకు ఇదే పరిస్థితి కనిపించడంతో కార్యాలయానికి వచ్చినవారు విస్మయం వ్యక్తం చేశారు.మద్యం సేవించి విధులకు ఎందుకు వచ్చారని ప్రశ్నించగా,సెలవు కోరినా అధికారులు మంజూరు చేయలేదని,నిన్న పరిస్థితుల కారణంగా మద్యం సేవించానని,ఈరోజు కూడా అదే విధంగా తాగి వచ్చినట్లు చెప్పినట్లు సమాచారం.ఉద్యోగి వ్యక్తిగత సమస్యలు ఏవైనా విధి నిర్వహణలో బాధ్యతను విస్మరించడం ఎంతవరకు సమంజసమనే చర్చ మొదలైంది.ప్రభుత్వ కార్యాలయంలో ఇలాంటి పరిణామాలు చోటుచేసుకోవడం కార్యాలయ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.ఉద్యోగుల పనితీరును పర్యవేక్షించాల్సిన అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.అటెండర్ వ్యవహారంపై అటవీ శాఖ ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టాలని, ఆరోపణలు నిజమని తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# తాగునీరు రోడ్డు పాలు.. అధికారుల అలసత్వమా? కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా?

**రెండు నెలలుగా వృథాగా పోతున్న మంచినీరు.. కలుషిత నీటితో ప్రజారోగ్యానికి ముప్పు!**

**శ్రీరామ కాలనీలో ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ధర్నా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**



**ఉప్పల్ నవంబర్ 11(పి సి డబ్ల్యూ న్యూస్):** ఒకవైపు రాబోయే రోజుల్లో తాగునీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని, ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించాలని ప్రభుత్వం ప్రజలకు సూచిస్తుంటే.. మరోవైపు ఉప్పల్ సర్కిల్ పరిధిలోని రామంతాపూర్ శ్రీరామ కాలనీలో గత రెండు నెలలుగా విలువైన తాగునీరు రోడ్లపాలవుతున్నా సంబంధిత అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. తాగునీటి లీకేజీ సమస్యను పరిష్కరించడంలో అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శ్రీరామ కాలనీలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు సరఫరా చేయాల్సిన విలువైన తాగునీరు రెండు నెలలుగా వృథాగా రోడ్లపై పారుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు.ఎంతో వ్యయప్రయాసలకోర్చి ప్రజలకు సరఫరా చేస్తున్న మంచినీరు ఇలా వృథా అవుతుంటే సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడం వారి పనితీరుకు నిదర్శనమని మండిపడ్డారు. పైగా నీటి పైపులైన్ లీకేజీల కారణంగా కలుషిత నీరు సరఫరా అవుతుండటంతో ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు.**ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం.. బాధ్యత ఎవరిది?**సమస్యను వెంటనే పరిష్కరించాల్సిన అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో 10 నుంచి 15 రోజులు గడుస్తున్నా మరమ్మతు పనులు పూర్తికాకపోవడం దారుణమని ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలపై స్పందించాల్సిన అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారు? కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి బాధ్యత వహించేది ఎవరు? ప్రభుత్వ నిధులతో సరఫరా చేస్తున్న తాగునీరు వృథా అవుతుంటే పర్యవేక్షణ చేస్తున్న అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి శ్రీరామ కాలనీలో తాగునీటి లీకేజీ సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని, కలుషిత నీటి సరఫరాను అరికట్టి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌పై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ నాయకులు తెడ్డు రవీందర్, ఆర్.పి. రఘు ప్రకాష్, వెంకట్, గోలి కృష్ణయ్య, ఎన్నగండ్ల శ్రీనివాస్, విజయ, సరిత, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు

# పట్టభద్రులకు ఉద్యోగాల కల్పనే ప్రధాన లక్ష్యం: దుండ్ర కుమారస్వామి

**- ఎమ్మెల్సీగా పోటీ చేయాలని యువత విజ్ఞప్తి.. సానుకూలంగా స్పందన**





**హైదరాబాద్, నవంబర్ 11 (పీసీడబ్ల్యూ న్యూస్):** పట్టభద్రుల సమస్యల పరిష్కారం, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. వెనుకబడిన వర్గాల గుడిమల్కాపూర్‌లోని కింగ్స్ ప్యాలెస్‌లో మన్నన్, బ్లిస్‌బర్గ్ ఫ్యూచర్ ఆఫ్ హోప్ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన 'పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంజాబ్ మేళా 2026'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డిగ్రీ, పీజీ పూర్తి చేసిన యువతకు అర్హతకు తగిన ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు కల్పించాలని అన్నారు. ప్రభుత్వ నియామకాల్లో పారదర్శకత, ప్రైవేటు రంగంలో స్థానిక యువతకు అవకాశాలు, విద్యార్హతలకు తగిన వేతనాలు కల్పించాలని పేర్కొన్నారు. ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లే పరిస్థితి మారాలని ఆకాంక్షించారు.**ఎమ్మెల్సీగా పోటీ చేయాలని విజ్ఞప్తి**రాబోయే హైదరాబాద్‌రంగారెడ్డిమహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని యువత, పట్టభద్రులు కుమారస్వామిని కోరారు. వారి విజ్ఞప్తిపై ఆయన సానుకూలంగా స్పందించారు. పట్టభద్రులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను శాసనమండలిలో వినిపించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సామాజిక న్యాయం, యువత ఉపాధి అవకాశాల కోసం నిరంతరం పోరాడుతానని తెలిపారు.

# ఆరోపణల సెగ.. జీఈసీఓ భాద్యతల నుంచి గాయత్రి ఔట్

**● నేటి నుండి బయ్యారం ఉన్నత పాఠశాలలో గాయత్రి స్కూల్ అసిస్టెంట్ గా విధులు..**

**● నూతన జీఈసీఓగా కె. విజయలక్ష్మి**

**● ఆరోపణల నేపథ్యంలో గాయత్రిపై కలెక్టర్ చర్య.. ● గాయత్రి తీరుపై 'పిసిడబ్లూ న్యూస్' పత్రికలో వచ్చిన వరుస కథనాలపై స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ విచారణకు ఆదేశం...**



**మహబూబాబాద్ ఎడ్యుకేషన్. నవంబర్ 11(పిసిడబ్లూ న్యూస్ ):** మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖలో కీలక పరిణామం చోటుచేసుకుంది. మహబూబాబాద్ జిల్లా నూతన జీఈసీఓగా కె. విజయలక్ష్మిని నియమిస్తూ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ నిర్ణయం తీసుకున్నారు . గతంలో జీఈసీఓగా పనిచేసిన గాయత్రిపై వచ్చిన పలు ఆరోపణలు,ఆమె పనితీరుపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఈ మార్పు జరిగినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా గాయత్రిపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నికోలస్ ఆదేశించారు.విచారణ కొనసాగుతున్న సమయంలోనే ఆమెను జీఈసీఓ బాధ్యతల నుంచి తప్పించడంతో ఈ వ్యవహారం జిల్లా విద్యాశాఖలో చర్చనీయాంశంగా మారింది. గాయత్రి ఇకపై బయ్యారం ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహించనున్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల స్పెషల్ ఆఫీసర్ల వ్యవహారంలో ఆమెపై పలు ఆరోపణలు రావడం.ముఖ్యంగా నేరడ కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సరస్వతిని టర్మినేషన్ చేయించడంలో గాయత్రి అత్యుత్సాహం చూపించారనే ఆరోపణలు వినిపించాయి. అలాగే గాయత్రి భర్త ప్రభాకర్ స్పెషల్ ఆఫీసర్లకు రాత్రి పూట ఫోన్లు చేసి డబ్బులు డిమాండ్ చేసి. బెదిరింపులకు దిగారనే ఆరోపణలపై 'పిసిడబ్లూ న్యూస్' దిన పత్రికలో వరుస కథనాలు ప్రచురితమైన నేపథ్యంలో ఈ అంశం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది . ఈ ఆరోపణలపై వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నికోలస్ విచారణకు ఆదేశించారు. **విచారణ ఫలితంపైనే ఉత్కంఠ....** గాయత్రిపై వచ్చిన ఆరోపణలు విచారణలో నిజమని తేలితే శాఖాపరమైన చర్యలు, సస్పెన్షన్ వంటి తదుపరి చర్యలు ఉండే అవకాశం ఉందని విద్యాశాఖ వర్గాల్లో చర్చ జరుగుతోంది . అయితే విచారణ పూర్తయ్యే వరకు ఎం చెప్పలేమని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల స్పెషల్ ఆఫీసర్లపై గాయత్రి వ్యవహరించిన తీరుపై గతంలోనే పలు ఫిర్యాదులు, ఆరోపణలు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమెను జీఈసీఓ బాధ్యతల నుంచి తప్పించి విచారణకు ఆదేశించడంతో సంబంధిత వర్గాల్లో ఆసక్తి నెలకొంది. జీఈసీఓ మార్పు.. ఆరోపణలపై విచారణ.. గాయత్రికి స్కూల్ అసిస్టెంట్ కొత్త బాధ్యతలు. ఈ పరిణామాల నేపథ్యంలో విద్యాశాఖలో ఇక ముందు ఎలాంటి చర్యలు చోటుచేసుకుంటాయన్నది ఆసక్తికరంగా మారింది.



మహబూబాబాద్ జిల్లా
నూతన జిఇసిఓగా కె. విజయలక్ష్మి

# డాక్టర్ కె. లక్ష్మణ్‌కు 'రైజింగ్ తెలంగాణ ఇంపాక్ట్ అవార్డ్' ఆహ్వానం



**హైదరాబాద్, నవంబర్ 11 (పీసీడబ్ల్యూ న్యూస్):** రాజ్యసభ సభ్యుడు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్‌ను నారీ నిర్మాణ్ అడ్వైజరీ ట్రస్ట్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. డిసెంబర్ 29న హైదరాబాద్ నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని తెలుగు లలిత కళాతోరణంలో నిర్వహించనున్న 'రైజింగ్ తెలంగాణ ఇంపాక్ట్ అవార్డ్స్2026' కార్యక్రమానికి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ మాదిరెడ్డి జగన్నాథం, ట్రస్టీ చలుమూరి పవన్‌కుమార్ మహిళా సాధికారత, ఎంఎస్ఎంఈ హబ్ ద్వారా ఉపాధి కల్పనకు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. స్పందించిన డాక్టర్ లక్ష్మణ్ అవార్డుల కార్యక్రమ నిర్వహణతో పాటు ఎంఎస్ఎంఈ హబ్ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు.సామాజిక సేవ, విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాల్లో విశేష సేవలందించిన వ్యక్తులు, సంస్థలకు ఈ అవార్డులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. డిసెంబర్ 29న సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు







**కరీంనగర్, నవంబర్ 11(పిసిడబ్లూ న్యూస్):** జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ మైనారిటీ విభాగం చైర్మన్ మహమ్మద్ తాజుద్దీన్ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా డీసీసీ అర్బన్ అధ్యక్షుడు డాక్టర్ వి. అంజన్ కుమార్ మాట్లాడుతూ.. మౌలానా అబుల్ కలాం ఆజాద్ గొప్ప మేధావి, విద్యావేత్త, సంఘ సంస్కర్త అని కొనియాడారు. దేశంలోని ప్రతి ఒక్కరికీ విద్య అందాలనే లక్ష్యంతో ఆయన విశేష కృషి చేశారని పేర్కొన్నారు.జిల్లా కాంగ్రెస్ మైనారిటీ విభాగం చైర్మన్ మహమ్మద్ తాజుద్దీన్ మాట్లాడుతూ.. పవిత్ర మక్కాలో జన్మించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర్య సమరయోధుడిగా, భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా, రెండుసార్లు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా విశేష సేవలందించారని తెలిపారు. హిందూ, ముస్లింలు ఐకమత్యంతో కలిసి జీవించాలని, దేశ విభజనను ఆయన వ్యతిరేకించారని గుర్తుచేశారు. నేడు దేశంలో విద్యా, సాంకేతిక రంగాల్లో అభివృద్ధికి పునాది వేసిన ఐఐటీలు, యూజీసీ వంటి సంస్థల స్థాపనలో ఆయన కీలక పాత్ర పోషించారని అన్నారు. దేశానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా భారతరత్న పురస్కారం లభించిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్, ఎస్టీ సెల్ చైర్మన్లు అరుణ్ కుమార్, శ్రవణ్ నాయక్‌తో పాటు కాంగ్రెస్ మైనారిటీ నాయకులు నేహాల్ అహ్మద్, అహ్మద్ అలీ, అబ్దుల్ రహెమాన్, లయీక్ ఖాద్రీ, ఖమరోద్దీన్, ఎండీ కలీమొద్దీన్, జమీలోద్దీన్, సిరాజ్, కార్పొరేటర్ మల్లేశం, ఇక్రం, సికందర్, సాహెభాజ్, సలీమొద్దీన్, అమీర్, షెబానా, హనీఫ్, అబ్దుల్ బారి, బషీర్, వసీం, అజీం, సాజిద్ అలీ, ఆరిఫ్ ఖాన్, రాజ్ కుమార్, మాదాసు మేరాజ్, శ్రీనివాస్, మహేష్, కిషన్, జైపాల్, సలీం, జమాల్ సాబ్, ఎండీ జమీల్, షాజీర్, ఆనంద్, సరిల్లా, రతన్ రాజ్, అస్వర్ తదితరులు పాల్గొన్నారు.

# బైక్‌తో ఇసుక క్రేన్.. వినూత్న ఆలోచనతో అబ్బురపరుస్తున్న వ్యక్తి: రాంటెంకి చంద్రశేఖర్

**సులభంగా భవనాల పైఅంతస్తులకు ఇసుక తరలింపు కూలీల శ్రమ, సమయం, ఖర్చు ఆదా**

**ఏటూరునాగారం నవంబర్11(పిసిడబ్ల్యూ న్యూస్):** సాధారణంగా భవన నిర్మాణ పనుల్లో ఇసుకను పైఅంతస్తులకు తరలించాలంటే కూలీలతో మోయించాల్సి ఉంటుంది. దీనివల్ల సమయంతో పాటు అధిక ఖర్చు కూడా అవుతుంది. ఈ సమస్యకు తన వినూత్న ఆలోచనతో పరిష్కారం చూపించాడు ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన రాంటెంకి చంద్రశేఖర్.డిగ్రీ వరకు చదువుకున్న చంద్రశేఖర్ ప్రస్తుతం టాటా ఏస్ గూడ్స్ వాహనాన్ని నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. భవన నిర్మాణ పనుల సమయంలో కూలీలు ఇసుక బస్తాలను పైఅంతస్తులకు మోసుకెళ్లేందుకు పడుతున్న ఇబ్బందులను గమనించాడు. పెద్ద పెద్ద క్రేన్లు ఏర్పాటు చేసుకునే ఆర్థిక స్థోమత లేనివారికి తక్కువ ఖర్చుతో ఉపయోగపడే యంత్రాన్ని తయారు చేయాలనే ఆలోచన చేశాడు.ఈ క్రమంలో పాడైపోయిన పాత



బైక్‌ను ఉపయోగించి ప్రత్యేక యంత్రాన్ని రూపొందించాడు. బైక్‌కు అవసరమైన పరికరాలను అమర్చి, తాడు, చక్రం, బకెట్ సహాయంతో ఇసుకను పైఅంతస్తులకు తరలించే విధంగా ఏర్పాటు చేశాడు. బైక్‌ను స్టార్ట్ చేసి యాక్సిలేటర్ ఇవ్వగానే తాడు సహాయంతో బకెట్‌లోని ఇసుక పైకి చేరుతుంది.**తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం** ఒక భవనానికి ట్రాక్టర్ ఇసుకను పైకి తరలించాలంటే సాధారణంగా రూ.1,000 నుంచి రూ.1,500 వరకు ఖర్చవుతుందని, అదే తన ఆలోచనతో రూపొందించిన యంత్రం ద్వారా సుమారు రూ.260 ఖర్చుతో ఇసుకను పైకి తరలించవచ్చని చంద్రశేఖర్ తెలిపాడు. ఈ యంత్రం తయారీకి సుమారు రూ.15 వేల వరకు ఖర్చు చేసినట్లు పేర్కొన్నాడు.తక్కువ ఖర్చుతో ఇసుకను పైఅంతస్తులకు తరలించడంతో పాటు కూలీల శ్రమ, సమయం ఆదా అవుతుందని ఆయన వివరించాడు. తన వినూత్న ఆలోచనతో రూపొందించిన ఈ యంత్రం భవన నిర్మాణ రంగంలో ఉపయోగపడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.సాధారణ బైక్‌ను వినూత్న యంత్రంగా మార్చి తన సృజనాత్మకతను చాటుకున్న చంద్రశేఖర్‌ను పలువురు అభినందిస్తున్నారు.

# ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

**- కరీంనగర్ మహా పాదయాత్రను విజయవంతం చేయండి: గుజ్జ శ్రీనివాసరావు**



**తిమ్మాపూర్, నవంబర్ 11 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని ప్రజల్లోకి వెళ్లి తిప్పికొట్టాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.నల్లొండ గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు చింతం శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన బీజేపీ ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ విషయంలో కాంగ్రెస్ అనవసర రాద్ధాంతం చేస్తోందని విమర్శించారు. కరీంనగర్‌లో ప్రజలు, యువత భాగస్వామ్యంతో నిర్వహించనున్న మహా పాదయాత్రకు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్ రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు.ఈ సమావేశంలో మువ్వరపు సంపత్, బూట్ల శ్రీనివాస్, గొట్టెముక్కుల తిరుపతిరెడ్డి, వేల్పుల ఓదేలు యాదవ్, బొనాల మోహన్, కొయ్యడ శ్రీనివాస్ తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రమాదంలో గాయపడిన బీజేపీ నాయకుడికి బండి సంజయ్ పరామర్శ



**కరీంనగర్, నవంబర్ 11 (పీసీడబ్ల్యూ న్యూస్):** రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు అంబటి తిరుపతి రాజును కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పరామర్శించారు.గంగిపల్లి నుంచి కరీంనగర్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మానకొండూర్ చెరువు కట్ట వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తిరుపతి రాజు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న బండి సంజయ్ తొలుత ఫోన్ చేసి ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కరీంనగర్‌లో అధికారిక కార్యక్రమాలు ముగించుకుని తిరుపతి రాజు ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడవద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా తిరుపతి రాజు కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట బోయినపల్లి ప్రవీణ్‌రావు, గుర్రాల వెంకట్‌రెడ్డి, రంగు భాస్కరాచారి, సర్పంచ్ వాల ప్రదీప్‌రావు తదితరులు ఉన్నారు.

# మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి

**- ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు: జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**

**ములుగు జిల్లా నవంబర్11( పి సి డబ్ల్యూ న్యూస్):** మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు.బుధవారం భారత తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ములుగు సమీకృత జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జీతో కలిసి మౌలానా అబుల్



కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుడిగా, భారత తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. దేశంలో విద్యావ్యవస్థ బలోపేతానికి, విద్యావకాశాల విస్తరణకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని, ప్రతి ఒక్కరూ విద్య ప్రాముఖ్యతను గుర్తించాలని పేర్కొన్నారు. జాతీయ సమైక్యత, సామరస్యం, సమానత్వం కోసం ఆయన చేసిన కృషిని ఆదర్శంగా తీసుకుని, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని సూచించారు.జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ అధికారి బి. రామ్మోహన్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. సిద్ధార్థ రెడ్డి, పరిపాలన అధికారి రాజ్‌కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మలేషియా అంతర్జాతీయ హాకీ టోర్నమెంట్‌కు కరీంనగర్ యువకులు

**- తెలంగాణ నుంచి ఇద్దరికే అవకాశం.. జిల్లా ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లనున్న క్రీడాకారులు**



Mohammad Rehman Ali



Mohd Rehan Khan

**కరీంనగర్, నవంబర్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లాకు చెందిన ఇద్దరు యువ హాకీ క్రీడాకారులు అంతర్జాతీయ టోర్నమెంట్‌కు ఎంపికై జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. మహ్మద్ రెహమాన్ అలీ, మహ్మద్ రెహాన్ ఖాన్‌లు మలేషియాలో జరగనున్న 49వ పెస్టా యూఎస్ఎం అంతర్జాతీయ ఇండోర్ హాకీ ఇన్విటేషనల్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఎంపికయ్యారు.ఈ టోర్నమెంట్ నవంబర్ 13 నుంచి 15 వరకు మలేషియాలోని పెనాంగ్‌లో నిర్వహించనున్నారు. విశేషమేమిటంటే తెలంగాణ రాష్ట్రం నుంచి ఈ ఇద్దరు క్రీడాకారులు మాత్రమే ఎంపిక కావడం కరీంనగర్ జిల్లాకు ప్రత్యేక గుర్తింపుగా నిలిచింది.2026 జూన్‌లో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన సీనియర్ ఇండోర్ హాకీ జాతీయ స్థాయి పోటీల్లో వీరిద్దరూ ప్రతిభ కనబరిచి, తమ అద్భుతమైన ఆటతీరుతో అంతర్జాతీయ టోర్నమెంట్‌లో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకున్నారు.ఈ పోటీల్లో సిక్స్-ఎ-సైడ్ ఇండోర్ హాకీ ఫార్మాట్‌లో క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నారు. వేగం, సమన్వయం, చాకచక్యం, జట్టుకృషికి ప్రాధాన్యత ఉండే ఈ పోటీల్లో పాల్గొనడం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకునేందుకు వీరికి మంచి అవకాశం లభించింది.కరీంనగర్‌కు చెందిన యువకులు అంతర్జాతీయ స్థాయికి ఎంపిక కావడంపై క్రీడాభిమానులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మహ్మద్ రెహమాన్ అలీ, మహ్మద్ రెహాన్ ఖాన్‌లు టోర్నమెంట్‌లో రాణించి తెలంగాణ రాష్ట్రంతో పాటు కరీంనగర్ జిల్లాకు మరింత పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నారు.వీరికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, అల్లాహ్ తఆలా మరిన్ని విజయాలు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నారు.

# కరీంనగర్‌లో ఫుడ్ పాయిజన్ కలకలం.. అరేబియన్ మంది తిన్న 20 మందికి అస్వస్థత...

**కరీంనగర్,నవంబర్11(పిసిడబ్ల్యూ న్యూస్):** నగరంలో మరోసారి ఆహార భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. కోర్టు సమీపంలోని అరేబియన్ మంది రెస్టారెంట్‌లో ఆహారం తీసుకున్న సుమారు 20 మంది అస్వస్థతకు గురైనట్లు సమాచారం. మంది తిన్న అనంతరం వాంతులు, విరేచనాలతో బాధపడుతూ పలువురు ఆసుపత్రులను ఆశ్రయించినట్లు తెలుస్తోంది.వివరాల్లోకి వెళితే.. శుక్రవారం కొందరు కస్టమర్లు సదరు రెస్టారెంట్‌లో మంది తిన్నారు. అనంతరం ఇళ్లకు చేరుకున్న కొద్దిసేపటికే వాంతులు, విరేచనాలు ప్రారంభమైనట్లు బాధితులు చెబుతున్నారు. ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లినట్లు సమాచారం. ఈ ఘటనలో వంశీ అనే యువకుడు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, ప్రస్తుతం కోలుకుంటున్నట్లు తెలిసింది.ఇటీవల నగరంలోని కేఎఫ్‌సీ ఆహార నాణ్యత





వ్యవహారం చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఆ ఘటన మరువకముందే మరో రెస్టారెంట్‌లో ఆహారం తీసుకున్న వారు అస్వస్థతకు గురయ్యారనే ఆరోపణలు రావడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. దీంతో హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార పదార్థాల నాణ్యత, నిల్వ విధానం, వంటగదుల పరిశుభ్రతపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.**ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు ఎక్కడ?** రెస్టారెంట్లలో వినియోగి ంచే మాంసం, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను అధికారులు క్రమం తప్పకుండా పరిశీలిస్తున్నారా? ఆహార పదార్థాల నిల్వ, తయారీ విధానాలపై తనిఖీలు నిర్వహిస్తున్నారా? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. అరేబియన్ మంది రెస్టారెంట్‌పై వచ్చిన ఆరోపణలపై ఫుడ్ సేఫ్టీ అధికారులు తక్షణమే స్పందించి విచారణ చేపట్టాలని, ఆహార నమూనాలను సేకరించి ప్రయోగశాలలో పరీక్షించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యానికి భంగం కలగకుండా హోటళ్లు, రెస్టారెంట్లలో నాణ్యత ప్రమాణాలు, పరిశుభ్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఈవీఎంల భద్రతా ప్రమాణాలను పకడ్బందీగా అమలు చేయాలి: జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు, నవంబర్ 11 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి అలసత్వం వహించకుండా పటిష్ఠ భద్రతా చర్యలు అమలు చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు.బుధవారం ములుగు ఆర్డీవో కార్యాలయ ఆవరణలోని ఈవీఎం గోదాను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆయన నెలవారీగా తనిఖీ చేశారు. గోదాం సీల్, సీసీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక పరికరాలు, పోలీసు బందోబస్తు, భద్రతా రిజిస్టర్లు, సందర్శకుల నమోదు పుస్తకాలను పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి సూచనలు చేశారు.ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించేందుకు ప్రతి నెలా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఈవీఎంలకు 24 గంటల పాటు పటిష్ఠ భద్రత కల్పిస్తున్నామని, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయభాస్కర్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ నితీష్‌కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఏటూరునాగారంలో కోర్టు సాధించుకోవడం మన హక్కు

**- ఆరు మండలాల్లో 1,380 కేసులు.. కోర్టు ఏర్పాటుకు అఖిలపక్షం పిలుపు**

**ములుగు జిల్లా, ఏటూరునాగారం, నవంబర్ 11 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** ఏటూరునాగారంలో కోర్టు ఏర్పాటు చేయించుకోవడం ప్రజల హక్కు అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహ రావు, సర్పంచ్ కాకులమర్రి శ్రీలత అన్నారు. బుధవారం ఏటూరునాగారంలోని సాయిబాబా ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. ఏటూరునాగారం, మంగపేట, వెంకటాపురం (కె), వాజేడు, తాడ్వాయి, కన్నాయిగూడెం మండలాల్లో సుమారు 1,380 కేసులు ఉన్నాయని, కోర్టు ఏర్పాటుకు అవసరమైన అర్హత ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా





ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గ్రామపంచాయతీ తరఫున తొలి తీర్మానం చేసే బాధ్యత తీసుకుంటామని సర్పంచ్ శ్రీలత తెలిపారు.కోర్టు సాధన సమితి నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# యూనియన్ బ్యాంక్ 108వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

**● కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్న బ్యాంకు సిబ్బంది**



**పరకాల, నవంబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):**
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 108వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను మంగళవారం పరకాల బ్రాంచ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ పి. సాయి కార్తీక్ ఆధ్వర్యంలో బ్యాంకు ఉద్యోగులు, వ్యాపారస్తులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. 1919 నవంబర్ 11న ముంబైలో స్థాపించబడిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 107 సంవత్సరాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని 108వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. శతాబ్దానికి పైగా దేశ ప్రజలకు బ్యాంకింగ్ సేవలు అందిస్తూ, ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది.రైతులు, చిరు వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు, మహిళలకు వివిధ రకాల ఆర్థిక సేవలు అందించడంతో పాటు ఆధునిక డిజిటల్ బ్యాంకింగ్ సేవల ద్వారా ఖాతాదారులకు మరింత చేరువవుతోంది. ప్రజల విశ్వాసమే బ్యాంకు విజయ ప్రస్థానానికి ప్రధాన బలమని ఈ సందర్భంగా సిబ్బంది పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ పి. సాయి కార్తీక్, బ్యాంకు ఉద్యోగులు పి. హెలెన్ హిల్లరీ, పి. వినయ్ కుమార్, పుష్ప, రాకేష్, బ్రహ్మచారి, కళ్యాణ్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# 70 రెవెన్యూ గ్రామాల్లో దశలవారీగా భూ రీ సర్వే

## పట్టాదారుల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం: కలెక్టర్ చిత్రా మిశ్రా






**కరీంనగర్, నవంబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లాలోని 70 రెవెన్యూ గ్రామాల్లో దశలవారీగా భూ రీ సర్వే చేపడుతున్నట్లు కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. రీ సర్వే కేవలం భూముల కొలతలు, హద్దుల నిర్ధారణకే పరిమితం కాకుండా పట్టాదారుల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి పరిష్కరించడమే లక్ష్యమని పేర్కొన్నారు. అభ్యంతరాల స్వీకరణ సమయంలో ఆర్డీవోలు, అదనపు కలెక్టర్లు గ్రామాల్లో పర్యటించి భూ విస్తీర్ణంలో తేడాలు, సరిహద్దుల వివాదాలపై విచారణ జరిపి పరిష్కారం చూపాలని ఆదేశించారు.బుధవారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవోలు షర్మిల, జలకుమారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కిషన్‌రావు తదితర అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఇప్పటికే 27 గ్రామాల్లో రీ సర్వే కొనసాగుతోందని, ఇప్పటివరకు 21,114.29 ఎకరాల్లో సర్వే పూర్తయిందని తెలిపారు. మరో 27 గ్రామాల్లో సర్వే ప్రారంభించేందుకు లైసెన్స్‌డ్ సర్వేయర్లతో కొత్త బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. వచ్చే వారంలో మరో 10 రోవర్లు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు.రీ సర్వే ప్రక్రియ, అభ్యంతరాల స్వీకరణపై గ్రామాల్లో డప్పు చాటింపు ద్వారా ప్రచారం నిర్వహించాలని, అవసరమైన చోట ఫ్లాగ్ పోల్స్ ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామపంచాయతీ అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, సర్వేయర్లకు ప్రతి 15 రోజులకు పారితోషికం అందించాలని ఆదేశించారు. సర్వే సిబ్బంది భద్రత కోసం సేఫ్టీ బూట్లు కూడా సమకూర్చినట్లు తెలిపారు.**ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతకు లబ్ధిదారుల గుర్తింపు పూర్తి**జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత నిర్మాణానికి అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. హుజూరాబాద్, మానకొండూరు, చొప్పదండి నియోజకవర్గాల్లో లబ్ధిదారుల ప్రొసీడింగ్స్ తయారీ 50 శాతం పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను త్వరలో పూర్తి చేసి సంబంధిత ఎమ్మెల్యేల చేతుల మీదుగా అందజేస్తామని వెల్లడించారు. అనంతరం ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.

# స్నేహం ముసుగులో నయవంచన..?

## - స్నేహం చేసే ముందు ఆలోచించండి.. తస్మాత్ జాగ్రత్త..?



**తొర్రూరు ప్రతినిధి, నవంబర్ 10 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** స్నేహం అంటే కష్టసుఖాల్లో తోడుగా ఉండటం.. ఇరువురికి ఒకరిపై మరొకరికి నమ్మకం బలంగా కలిగి ఉండటం. అలాంటి స్నేహంలోనే మోసం ఎదురైతే ఆ బాధను భరించడం అంత సులభం కాదు. నమ్మిన వ్యక్తే నమ్మకద్రోహానికి పాల్పడితే కలిగే మనోవేదన మాటల్లో చెప్పలేనిది. ఇలాంటి సంఘటన మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలో చోటుచేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. స్నేహితుడి చేతిలో మోసపోయిన ఓ వ్యక్తి తన ఆవేదనను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడం చర్చనీయాంశంగా మారింది. స్నేహితుడిని నమ్మడమే తాను చేసిన తప్పా..? అని ప్రశ్నిస్తూ,స్నేహం పేరుతో ఎదురైన మోసాన్ని భావోద్వేగపూరితంగా వెల్లడించారు. అవసరాల కోసం దగ్గరై తన స్వార్థ పూరిత పనులు నెరవేరిన తర్వాత దూరమవడం, తన నమ్మకాన్ని వమ్ము చేయడం ఎంతవరకు సమంజసమని తన పోస్టులో ప్రశ్నించారు ?.**స్నేహాన్ని అడ్డం పెట్టుకొని నాకు జరిగిన మోసం మరొకరికి జరగకూడదు..!** తనకు ఎదురైన అనుభవం మరెవరూ ఎదుర్కోకూడదనే ఉద్దేశంతో స్నేహితుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఇతరులకు సూచించారు.
నాకు జరిగిన మోసం అందరికీ జరగొచ్చు.. స్నేహం పేరుతో ప్రతి ఒక్కరినీ గుడ్డిగా నమ్మకండి.. జాగ్రత్త సుమా అంటూ తన ఆవేదనను సామాజిక మాధ్యమ వేదికగా పంచుకు న్నారు .కుటుంబం కోసం, జీవితంలో విలువల కోసం తన కోపాన్ని దిగమింగుకుంటున్నానని పేర్కొం టూ మనసులోని బాధను బయటపెట్టారు?. ఈ పోస్టు ద్వారా తనకు జరిగిన అన్యాయాన్ని పలువురికి తెలియ జేయడంతో పాటు, స్నేహం విషయంలో తొందరపడి నమ్మకూడదనే సందేశాన్ని అందించే ప్రయత్నం చేశారు.స్నేహం చేయడం గొప్ప కాదు.. ఆ స్నేహానికి చివరి వరకు కట్టుబడి ఉండటమే నిజమైన గొప్పతనం. అవసరానికి స్నేహం చేసి,స్వార్థం కోసం నమ్మకాన్ని వమ్ము చేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలనే సందేశం ఈ ఘటన ద్వారా వెలువడుతోంది.

# ముంబై తెలంగాణ ఉద్యమకారులకు ఘన స్వాగతం పలికేందుకు తెలంగాణ కోఆర్డినేటర్లు సిద్ధం




**జవహర్ నగర్ నవంబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్‌లో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం సోయబ్ హాల్లో ముంబై తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (ఎంటీజేఏసీ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉద్యమకారుల సభకు ముంబై నుంచి కార్యకర్తల బృందం బయలుదేరింది.ముంబై, భివండి, నవీ ముంబై, సూరత్ ప్రాంతాలకు చెందిన తెలంగాణ ఉద్యమకారులు ఈ సభలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చేరుకోనున్న ఉద్యమకారులకు తెలంగాణ కోఆర్డినేటర్లు ఘన స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు.తెలంగాణ ఉద్యమకారుల హక్కులు, సంక్షేమం, ప్రభుత్వ కేకే కమిటీ ద్వారా సమన్యాయం సాధించాలనే ఆకాంక్షతో నిర్వహిస్తున్న ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కేకే కమిటీ సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం, శోభన్ రెడ్డి, రాములు నాయక్, అద్దంకి దయాకర్ తదితరులు హాజరుకానున్నారు.ముంబై నుంచి బయలుదేరిన బృందానికి ఎంటీజేఏసీ కన్వీనర్ సిరిపంగి రవీందర్, నార్పక లక్ష్మణ్ మహరాజ్, గాజుల మహేష్, గవ్వల శ్రీనివాస్ కురుమ, రఘునాథ్ పద్మశాలి తదితరులు నాయకత్వం వహిస్తున్నారు.తెలంగాణ కోఆర్డినేటర్లు సిర్పా గంగాధర్, కాసుల నర్సింహ గౌడ్, సీహెచ్ గణేష్ ముదిరాజ్, కట్ల నర్సింహ మాల, దూదేకుల రసీద్, బట్టు శ్రీధర్ గంగపుత్ర తదితరులు ముంబై నుంచి వస్తున్న ఉద్యమకారులకు ఆత్మీయ స్వాగతం పలుకుతూ, సభను విజయవంతం చేసేందుకు సమన్వయంతో ముందుకు సాగుతున్నారు.


# శబరిమలై యాత్రకు తొర్రూరు డిపో నుంచి ప్రత్యేక బస్సులు

**● 36 మంది భక్తులు ఒక బృందంగా ఉంటే ప్రత్యేక బస్సు..**
**కేరళ సరిహద్దు పన్ను మినహాయింపు**









**తొర్రూరు ప్రతినిధి, నవంబర్ 10 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** కార్తీక మాసం సందర్భంగా శబరిమలై వెళ్లే అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం తొర్రూరు టీజీఎస్ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ కె. ప్రసూన లక్ష్మి తెలిపారు. 36 మంది భక్తులు ఒక బృందంగా ఏర్పడితే ప్రత్యేక బస్సు బుక్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ఈ బస్సులకు కేరళ రాష్ట్ర సరిహద్దు పన్ను మినహాయింపు ఉంటుందని, భక్తులు తమకు అనుకూలమైన మార్గాన్ని ఎంచుకోవచ్చని పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన డ్రైవర్లతో సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణం కల్పిస్తామన్నారు. శబరిమలైతో పాటు ఇతర పుణ్యక్షేత్రాల యాత్రలు, వివాహాలు, విహారయాత్రలకూ ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. భక్తులు, గురుస్వాములు, భక్త బృందాలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. స్సుల బుకింగ్, వివరాలకు సంప్రదించండి: 9959226053, 9963991518. మీ ప్రయాణం సురక్షితం మా బాధ్యత.

# రక్త సంబంధీకుల ఐక్యతా వేదికగా మున్నూరుకాపు వన సమారాధన!

**కలిసుంటే కలదు బలం.. సంఘటితంగా సాగితే సమాజానికి బంగారు భవిష్యత్తు!**
**- ఈ నెల 15న ఖమ్మంలో మున్నూరుకాపుల ఆత్మీయ సమ్మేళనం..**
**కుటుంబ సభ్యులందరూ తరలిరావాలి**
**- మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ, జిల్లా గౌరవాధ్యక్షుడు కొత్త సీతారాములు**



**ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కుటుంబాల మధ్య ఆత్మీయతను పెంచుతూ.. రక్త సంబంధీకుల తరాల మధ్య అనుబంధాలను పదిలపరుస్తూ.. కష్టసుఖాల్లో ఒకరికొకరు అండగా నిలిచే సోదరభావాన్ని చాటుతూ మున్నూరుకాపు బంధువులందరినీ ఒకే వేదికపైకి తీసుకురావాలనే సదుద్దేశంతో ఈ నెల 15న ఖమ్మంలో వన సమారాధన నిర్వహించనున్నారు. కుల బాంధవుల మధ్య ఐక్యత, ఆప్యాయత, అనుబంధాలను మరింత బలోపేతం చేయడమే ఈ వేడుక ప్రధాన లక్ష్యమని సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం ఖమ్మం నగరంలోని చెరుకూరి వారి మామిడితోటలో కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లను సంఘం పెద్దలు, ప్రముఖులు, నాయకులు పరిశీలించారు.వన సమారాధన నిర్వహించే ప్రాంగణం, వేదిక, భోజన వసతి, తాగునీరు, పార్కింగ్ తదితర ఏర్పాట్లను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం సంఘం పెద్దలు మాట్లాడుతూ.. వన సమారాధన అంటే కేవలం కలిసి భోజనం చేయడం, ఆనందంగా గడపడమే కాదని, ఒకరినొకరు పలకరించుకోవడం, కుటుంబాల మధ్య పరిచయాలు పెంచుకోవడం, పెద్దల ఆశీస్సులు పొందడం, యువతకు మార్గదర్శనం చేయడం, భావితరాలకు ఐక్యతా స్ఫూర్తిని అందించడమని పేర్కొన్నారు.సమాజంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా అందరం కలిసి అండగా నిలవాలనే సోదరభావం పెంపొందించుకోవాలని అన్నారు. విద్య, వైద్యం, ఉద్యోగం, వ్యాపారం, రాజకీయ రంగాల్లో మున్నూరుకాపు సమాజం మరింత అభివృద్ధి సాధించాలంటే ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమన్నారు. వ్యక్తిగత ఎదుగుదలతో పాటు సమాజంలోని ప్రతి కుటుంబం అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ నెల 15న నిర్వహించనున్న వన సమారాధనకు ఖమ్మం జిల్లా నలుమూలల నుంచి మున్నూరుకాపు కుల బాంధవులు, మహిళలు, యువత, విద్యార్థులు, చిన్నారులు, పెద్దలు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో తరలిరావాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఎన్నో రోజుల తర్వాత కలుసుకునే బంధువులతో ఆత్మీయంగా గడుపుతూ, ఒకరి సంతోషాన్ని మరొకరు పంచుకుంటూ, సమాజ ఐక్యతను చాటే ఈ వేడుకను ప్రతి కుటుంబం తమ సొంత వేడుకగా భావించి విజయవంతం చేయాలని కోరారు.
కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు సంఘం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ, జిల్లా గౌరవాధ్యక్షుడు కొత్త సీతారాములు, మాజీ అధ్యక్షుడు పార నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పసుపులేటి దేవేందర్, గౌరవ సలహాదారులు మెంతుల శ్రీశైలం, తాళ్లూరి హనుమంతరావు, పొదిల రవికుమార్, గీతా వెంకన్న, జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు తోట రమేష్, పట్టణ ఉపాధ్యక్షుడు పార ఉదయ్, జిల్లా కోశాధికారి మడూరి పూర్ణ, పట్టణ అధ్యక్షుడు కావేరి సాయి, జిల్లా ఉపాధ్యక్షులు ఆకుతోట శేఖర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# కంటాయపాలెం గ్రామస్తుల చిరకాల కోరిక నెరవేర్చిన ఎమ్మెల్యే

**- తొర్రూరు కంటాయపాలెం రహదారి అభివృద్ధికి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి శంకుస్థాపన చేశారు.**





**తొర్రూరు ప్రతినిధి, నవంబర్ 10 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా, తొర్రూర్ మండలంలోని కంటాయపాలెం గ్రామం గ్రామస్తుల చిరకాల కోరికను నెరవేర్చిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి. తోరూర్ పట్టణం నుండి కంటాయపాలెం గ్రామానికి వెళ్లే రహదారి కి ఎంతో ప్రాధాన్యత ఇస్తూరూ. 4.92 కోట్లతో రహదారి అభివృద్ధి పనులు.. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం అని బుధవారం రహదారికి శంకుస్థాపన చేశారు.తొర్రూరు పట్టణం నుంచి కంటాయపాలెం గ్రామానికి వెళ్లే రహదారి ఎంతో ప్రాధాన్యత కలిగినది. ఈ మార్గం ద్వారా నిత్యం అనేక గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు ఈ రహదారిపై ఆధారపడి ప్రయాణాలు చేస్తుంటారు. రహదారి అభివృద్ధి పూర్తయితే ప్రజల ప్రయాణ కష్టాలు తగ్గడంతో పాటు రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయి.ఈ నేపథ్యంలో సుమారు రూ. 4.92 కోట్ల వ్యయంతో తొర్రూరు పట్టణ పరిధిలోని తొర్రూరు కంటాయపాలెం రహదారిని అభివృద్ధి చేయనున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం రహదారి అభివృద్ధి పనులకు నిధులు కేటాయించగా, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పనులు ప్రారంభమయ్యేలా కృషి చేశారు.నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతానికి మెరుగైన రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తిస్తూ వాటి పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారు.రహదారి అభివృద్ధి పనులు పూర్తయిన అనంతరం తొర్రూరు నుంచి కంటాయపాలెం వరకు ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారనుంది. ఈ అభివృద్ధి పనులతో స్థానిక ప్రజలకు ఎంతో మేలు చేకూరనుండటంతో ఆయా ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే చొరవతో మరో కీలక అభివృద్ధి పనికి శ్రీకారం చుట్టడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# ముస్లిం సమాజం సమ్మతి లేకుండా చేపట్టిన మట్టిపనులు నిలిపివేత

**• పాత ఈద్గా వెనుక మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన పనులను అడ్డుకున్న ఎంఐఎం నాయకులు**



**కరీంనగర్, నవంబర్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లాలోనీ కళాభారతి వద్ద గల పాత ఈద్గా వెనుక ముస్లిం సమాజం అనుమతి లేదా సమ్మతి లేకుండా మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన మట్టిపనులను ఈరోజు నిలిపివేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎంఐఎం టౌన్ ప్రెసిడెంట్ మహ్మద్ అతీఫ్ అతీనా తన బృందంతో కలిసి అక్కడికి చేరుకుని పనులను నిలిపివేయాలని సంబంధిత అధికారులను కోరారు.ఈ క్రమంలో ఎంఐఎం నాయకులు జోక్యం చేసుకుని మట్టిపనులు కొనసాగకుండా చర్యలు తీసుకున్నారు. ముస్లిం సమాజానికి సంబంధించిన స్థలంలో ఎలాంటి పనులు చేపట్టాలన్నా ముందుగా సమాజ పెద్దలతో చర్చించి, వారి సమ్మతి తీసుకోవాలని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.ఈ విషయాన్ని ఎంఐఎం కార్పొరేటర్ మహ్మద్ మాజీద్ హుస్సేన్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అతిఫ్ అతినా, మహమ్మద్ మాజిద్ హుస్సేన్, మోసిన్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ తదితరులు పాల్గొన్నారు.

# కమలాపూర్‌లో ఎంజెపి బాలికల కళాశాల,పాఠశాలల జిల్లాస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

**- ముఖ్య అతిథిగా పాల్గొన్న హనుమకొండ అడిషనల్ కలెక్టర్ ఎన్ రవి.**







**కమలాపూర్ నవంబర్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతి బాపులే బాలికల పాఠశాలలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల కళాశాలల బాలికల అండర్ 14,17,19 జిల్లా స్థాయి క్రీడా పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి.ఈ క్రీడా పోటీలను ముఖ్య అతిథిగా పాల్గొన్న హనుమకొండ అడిషనల్ కలెక్టర్ ఎన్ రవి జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల శారీరక మానసిక ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.చదువుతోపాటు క్రీడల్లో రాణించడం వలన మంచి క్రమశిక్షణతో పాటు విద్యార్థులు నాయకత్వ లక్షణాలు కలిగి ఉంటారని పేర్కొన్నారు.మేము చదువుకునే రోజుల్లో కనీసం వేసుకోవడానికి కాళ్లకు చెప్పులు కూడా లేవని,సరియైన వసతులు లేక చెట్ల కింద కూర్చొని దీపం వెలుతురులో చదువుకొని కష్టపడి ఈ స్థాయిలో ఉన్నామని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అధునాతన హంగులతో భవనాలు,మెరుగైన వసతులు సదుపాయాలు కల్పించి యూనిఫామ్స్,టై, బెల్ట్, రుచికరమైన భోజనం అందిస్తూ శిక్షణ పొందిన ఉపాధ్యాయ బృందం నాణ్యమైన విద్య బోధన,మానసిక ఉల్లాసానికి క్రీడా పోటీలు,సకల సౌకర్యాలు ఏర్పాటుచేసి నయా పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ విద్యను అందిస్తూ విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వ కృషి చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో కమలాపూర్ తాహసిల్దార్ ఏం సురేష్ కుమార్,ఎం జె పి హనుమకొండ జిల్లా డిసిఒ స్టెల్లా,వరంగల్ ఉమ్మడి జిల్లాల డిసిఒలు,ఎం జె పి కమలాపూర్ బాలికల ప్రిన్సిపాల్ సౌజన్య, ఉమ్మడి వరంగల్ జిల్లాల పాఠశాలల కళాశాలల ప్రిన్సిపాల్స్,వ్యాయామ ఉపాధ్యాయులు,ఉపాధ్యాయ బృందం,విద్యార్థినిలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి

**• వరి సాగుతో నష్టపోయే ప్రమాదం.. తక్కువ నీటి పంటలను ఎంచుకోవాలి: కలెక్టర్ దివాకర టి.ఎస్**



**సత్తుపల్లి, నవంబర్ 11 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షపాతం తగ్గి నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు అధిక నీరు అవసరమయ్యే వరి సాగుకు దూరంగా ఉండి ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ సూచించారు. బుధవారం సత్తుపల్లి మండలం అయ్యగారిపేటలో పంట పొలాలను సందర్శించి వరి నార్లు పోస్తున్న రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ప్రస్తుత నీటి లభ్యతను చూసి భవిష్యత్తులోనూ సమృద్ధిగా నీరు ఉంటుందని భావించి వరి సాగు చేపట్టవద్దన్నారు. పంట చివరి దశలో నీటి కొరత ఏర్పడితే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వ్యవసాయ శాఖ అధికారుల సలహాతో తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేయాలని, నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# మర్రిపల్లిలో రేషన్ షాప్ సబ్ సెంటర్ ప్రారంభం

**గ్రామ ప్రజల కల నెరవేరిన వేళ, వోడితల ప్రణవ్ బాబుకు రుణపడి ఉంటాం.గ్రామ ప్రజలు**

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ మౌటం కుమారస్వామి**





**కమలాపూర్ నవంబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల పరిధిలోని మర్రిపల్లి గ్రామంలో రేషన్ షాప్(సబ్ సెంటర్) గ్రామ సర్పంచ్ ఇనుగాల రాజుతో కలిసి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ మౌటం కుమారస్వామి బుధవారం ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ ఎన్నికల ప్రచారం లో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ వోడితల ప్రణవ్ బాబు గ్రామాన్ని సందర్శించిన సందర్భంలో మర్రిపల్లి గ్రామ ప్రజల చిరకాల వాంఛ కోరిక రేషన్ దుకాణం గ్రామం లో ఏర్పాటు చేయాలని ఇంచార్జ్ వోడితల ప్రణవ్ బాబుకు ప్రజలు విజ్ఞప్తి చేయడం జరిగింది. వెంటనే స్పందించిన ప్రణవ్ బాబు కచ్చితంగా మీ అందరి కోరిక నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజల కోరిక మేరకు ఇచ్చిన హామీని రేషన్ షాప్ ను మంజూరు చేయించి, గ్రామ ప్రజల సమస్యను తీర్చడం జరిగింది.ఈ సందర్భంగా నియోజకవర్గ ఇంచార్జ్ వోడితల ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మౌటం కుమారస్వామి రేషన్ షాప్(సబ్ సెంటర్) ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై రేషన్ షాపును ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ మౌటం కుమార్ స్వామి మాట్లాడుతూ నియోజకవర్గ ఇంచార్జ్ వోడితల ప్రణవ్ బాబు ఎన్నికల్లో గెలుపు ఓటముల తో సంబంధం లేకుండా నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి తన వంతు కృషి చేస్తున్నారని అన్నారు.అందులో భాగంగానే మర్రిపల్లి గ్రామానికి ఇచ్చిన మాట ప్రకారం రేషన్ షాప్ మంజూరు చేయించి తరతరాలుగా గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించి గ్రామ ప్రజల కోరికను నెరవేర్చారని అన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఆనందోత్సవాల తో స్వీట్స్ పంచి బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.మా గ్రామ ప్రజల సమస్య తీర్చిన హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ వోడితల ప్రణవ్ బాబుకు జీవితాంతం గ్రామ ప్రజలు అందరూ రుణపడి ఉంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇనుగాల రాజు,ఉప సర్పంచ్ తుమ్మల మమతా రమేష్, కమలాపూర్ యువజన కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చేరాల రోహిత్ కుమార్,వార్డ్ మెంబర్లు మారెపల్లి రఘుపతి,తుమ్మల నరేష్,నరెడ్ల శీను యాటకాల రమేష్,ఇనుగాల మౌనిక తిరుపతి,ఇనుగాల పద్మ స్వామి, మర్రిపెల్లి గ్రామ మాజీ సర్పంచ్ తుమ్మల బుచ్చి మల్లు,మాజీ ఉపసర్పంచ్ తుమ్మల తిరుపతి, నాయకులు నరెడ్ల స్వామి,గ్రామ శాఖ అధ్యక్షులు తుమ్మల సంతోష్,నాయకులు యాటకాల రాజు, బూర్గుల స్వామి,నన్నే నరసింహస్వామి,తుమ్మల రాములు,కమలాపూర్ వార్డ్ మెంబర్ గంధసిరి అనిల్,గ్రామ ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మౌలానా ఆజాద్ ఆశయాలకు అనుగుణంగా అందరికీ విద్య అందించాలి

**- జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, ప్యాడ్లు, పెన్నుల పంపిణీ**





**కరీంనగర్, నవంబర్ 11 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** భారత తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ మైనారిటీ సెల్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆజాద్ చిత్రపటానికి, పెద్దపల్లి రోడ్ ఫ్లైఓవర్ సమీపంలోని ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అహ్మద్‌పురాలోని షాషాబ్ ఉర్దూ మీడియం పాఠశాల, ఖాన్‌పూర్‌లోని గల్ఫ్ హైస్కూల్ విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ విద్య అందాలని కలలు కన్న మహనీయుడు మౌలానా ఆజాద్ అని కొనియాడారు. దేశంలో గొప్ప విద్యాసంస్థల ఏర్పాటుకు ఆయన పునాదులు వేశారని మహమ్మద్ తాజుద్దీన్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో విద్యారంగం అభివృద్ధి పథంలో సాగుతోందని ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై టాస్క్‌ఫోర్స్ దాడులు

**- రెండు లారీలు సీజ్.. ఇద్దరు అరెస్ట్, మరొకరు పరారీ**



**తల్లాడ, నవంబర్ 11 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** అక్రమ ఇసుక రవాణాపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. బుధవారం రాత్రి తల్లాడ మండలం రామానుజవరం గ్రామంలో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను పట్టుకుని సీజ్ చేశారు. సుమారు రూ. 60 వేల విలువైన ఇసుకతో పాటు లారీలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరిని అరెస్ట్ చేయగా, మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్కను కలిసిన కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి





**కమలాపూర్ నవంబర్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనకు వచ్చిన తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి,ఆర్థిక విద్యుత్ శాఖ మంత్రి మల్లు బట్టి విక్రమార్క ను హనుమకొండ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి తో కమలాపూర్ అభివృద్ధిపై చర్చించారు. కమలాపూర్ మండల అభివృద్ధికి సహకరించాలని, నిధులు మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రి ని కోరారు. ఉపముఖ్యమంత్రి నా వంతు సహకారం అందిస్తానని తప్పకుండా అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారని మార్కెట్ చైర్మన్ తెలిపారు.

# మురుసు తుఫాన్ దెబ్బకు రైతుల కన్నీటి కష్టాలు

**● పంట నష్టాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ● ఎకరాకు రూ.50 వేల పరిహారం అందించాలి ● నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం చేయాలి.. ప్రభుత్వానికి సండ్ర డిమాండ్**







**కల్లూరు, నవంబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :**మురుసు తుఫాన్ ప్రభావంతో తీవ్రంగా దెబ్బతిన్న పంట పొలాలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య రైతులతో కలిసి పరిశీలించారు. కల్లూరు మండలంలోని లింగాల, పాత ఎర్రబోయినపల్లి, కొత్త ఎర్రబోయినపల్లి, చంద్రుపట్ల గ్రామాల్లో పర్యటించి తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా పంట నష్టపోయిన రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలు తుఫాన్ ప్రభావంతో దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ తుఫాన్ కారణంగా నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణమే పంట నష్టం సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి, బాధిత రైతులందరికీ ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని కోరారు. పంట నష్టపరిహారం విషయంలో ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలను సడలించి, వాస్తవంగా నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే నష్టపరిహారం ప్రకటించి, ఆర్థికంగా చితికిపోయిన రైతులకు అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ నాయకులు మాజీ జడ్పీటీసీలు కట్టా అజయ్ కుమార్, లక్కినేని రఘు, కౌన్సిలర్ పెడకంటి రామకృష్ణ, దేవరపల్లి భాస్కరరావు, లింగాల సర్పంచ్ వేమకృష్ణ, ఎర్రబోయినపల్లి సర్పంచ్ పోట్రు శ్రీనివాసరావుతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలి: అమీర్ బాబు



**కడప నవంబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :**భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా స్వర్గీయ మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు మరువలేమని కడప టిడిపి నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ వి. ఎస్. అమీర్ బాబు అన్నారు. బుధవారం ఆజాద్ జయంతి సందర్భంగా కో-ఆపరేటివ్ కాలనీలో వారి కార్యాలయం నందు ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి ఆయనను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు ముందుకు నడవాలని అయినా అన్నారు. మౌలానా జయంతి నీ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీస్ డే నిర్వహిస్తూ వస్తున్నారని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో రఫీ ఖాన్. . షేక్ మగ్బూల్ అహ్మద్. తదితరులు పాల్గొన్నారు.

# విద్యా రంగ అభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయం: జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్.

**కర్నూలు నవంబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** దేశ విద్యారంగ అభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయమని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పేర్కొన్నారు.బుధవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని మైనార్టీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్న సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, విద్య ద్వారానే సమాజ అభివృద్ధి, దేశ ప్రగతి సాధ్యమవుతుందని మౌలానా అబుల్ కలాం ఆజాద్ విశ్వసించారని తెలిపారు. గాంధీజీ భావజాలంతో స్వాతంత్ర ఉద్యమంలోనూ ఆయన ఎంతో చురుగ్గా పనిచేశారన్నారు. విద్య అందరికీ అందుబాటులో ఉండాలనే ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని, విద్య ప్రాధాన్యతను గుర్తిస్తూ ప్రతి ఒక్కరూ విద్యాభివృద్ధికి కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు.



# ప్రమాద బాధితులకు అండగా నిలవాలి

**గుడ్ సమారిటన్లకు చట్టపరమైన రక్షణ సహాయం చేసేందుకు ఎవరూ వెనుకాడొద్దు: జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ్ గోపాల్**

**కడప, నవంబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులను సకాలంలో ఆసుపత్రులకు తరలించి ప్రాణాలు కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మానవత్వంతో ముందుకు రావాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ్ గోపాల్ పిలుపునిచ్చారు. ప్రమాద బాధితులకు సహాయం చేసే గుడ్ సమారిటన్లకు చట్టపరమైన రక్షణ ఉందని, ఎలాంటి విచారణలు, చట్టపరమైన ఇబ్బందులకు భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు.బుధవారం



జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుడ్ సమారిటన్ అండ్ యాక్సిడెంట్ విక్టిమ్ ప్రొటెక్షన్ చార్టర్లోని నిబంధనలను వివరించారు. ప్రమాద బాధితులకు ఆసుపత్రులు తక్షణమే అత్యవసర వైద్యం అందించాలని, పోలీసు విచారణలు లేదా ఇతర లాంఛనాల పేరుతో చికిత్సలో జాప్యం చేయకూడదని స్పష్టం చేశారు.బాధితులను ఆసుపత్రికి చేర్చిన సహాయకులు తమ వ్యక్తిగత వివరాలు వెల్లడించాల్సిన అవసరం లేదని, వారు కోరుకుంటే వెంటనే వెళ్లిపోవచ్చని తెలిపారు. సహాయకులను నిర్బంధించడం, వైద్య ఖర్చులు చెల్లించాలని ఒత్తిడి చేయడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. హక్కులకు భంగం కలిగితే ఆసుపత్రి నోడల్ అధికారి లేదా వైద్య పర్యవేక్షకుడికి ఫిర్యాదు చేయవచ్చన్నారు.ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యతని, సకాలంలో అందించే చిన్న సహాయం ఒక నిండు ప్రాణాన్ని కాపాడగలదని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

# చేయి చచ్చుబడిందని నిరాశ వద్దు.. మళ్లీ కదిలించవచ్చు!

**● ఆధునిక శస్త్రచికిత్సలతో బ్రేకియల్ ప్లెక్సస్ ఇంజురీకి చికిత్స ● రోడ్డు ప్రమాదాలతో యువతలో పెరుగుతున్న చేతి నరాల గాయాలు ● సకాలంలో వైద్యుడిని సంప్రదిస్తే మెరుగైన ఫలితాలు ● ప్రముఖ సర్జన్ డాక్టర్ ఆర్.వి. కోటేశ్వరరావు వెల్లడి**

**గుంటూరు నవంబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :**రోడ్డు ప్రమాదాల్లో చేతికి సరఫరా చేసే నరాలు దెబ్బతిని చేయి చచ్చుబడిపోయినంత మాత్రాన జీవితంపై ఆశలు వదులుకోవాల్సిన అవసరం లేదని, ఆధునిక శస్త్రచికిత్సల ద్వారా తిరిగి చేతికి కదలికలు, స్పర్శ తీసుకురావడానికి అవకాశాలు ఉన్నాయని యశోద హాస్పిటల్ ప్రముఖ ప్లాస్టిక్ అండ్ రీకన్స్ట్రక్టివ్ సర్జన్, బ్రేకియల్ ప్లెక్సస్ సర్జన్ డాక్టర్ ఆర్.వి. కోటేశ్వరరావు తెలిపారు. నరాల గాయాలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో నిపుణులైన వైద్యులను సంప్రదించి తగిన చికిత్స పొందాలని సూచించారు.గుంటూరులోని హోటల్ సింధూరిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన బ్రేకియల్ ప్లెక్సస్ ఇంజురీ (చేతికి సరఫరా చేసే నరాల గాయం) గురించి వివరించారు.**ద్విచక్ర వాహన ప్రమాదాలే ప్రధాన కారణం....!**ఈ సందర్భంగా డాక్టర్ ఆర్ వి కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం రోడ్డు ప్రమాదాల కారణంగా ముఖ్యంగా టీనేజర్లు, యువతలో బ్రేకియల్ ప్లెక్సస్ ఇంజురీ కేసులు ఎక్కువగా కనిపిస్తున్నాయని తెలిపారు. ద్విచక్ర వాహన



ప్రమాదాల్లో భుజం ప్రాంతానికి బలమైన దెబ్బ తగలడం వల్ల చేతికి సంబంధించిన నరాలు దెబ్బతింటున్నాయని వివరించారు. ఈ నరాల గాయాల తీవ్రతను బట్టి కొందరిలో భుజం కదలికలు నిలిచిపోతే, మరికొందరిలో మోచేయి పని చేయదని, ఇంకొందరిలో భుజం నుంచి వేళ్ల వరకు చేయి పూర్తిగా చచ్చుబడినట్లుగా మారుతుందని పేర్కొన్నారు.**లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం వద్దు**చేతిలో కదలికలు లేకపోవడం, స్పర్శ కోల్పోవడం, భుజం లేదా మోచేయి పనిచేయకపోవడం వంటి లక్షణాలు కనిపించినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. చాలామంది సరైన అవగాహన లేకుండా చికిత్సలో జాప్యం చేస్తున్నారని, మరికొందరు కేవలం ఫిజియోథెరపీతోనే సమస్య పరిష్కారమవుతుందని భావిస్తున్నారని తెలిపారు. దీనివల్ల నరాలకు సంబంధించిన శస్త్రచికిత్సలు చేయాల్సిన సరైన సమయం దాటిపోయే ప్రమాదం ఉందన్నారు.**ఆధునిక శస్త్రచికిత్సలతో తిరిగి చేతికి కదలికలు**బ్రేకియల్ ప్లెక్సస్ ఇంజురీ చికిత్సలో భాగంగా దెబ్బతిన్న నరాలను తిరిగి జోడించడం, ఇతర నరాలను అనుసంధానం చేయడం, కండరాల మార్పిడి, టెండన్ ట్రాన్స్ఫర్ వంటి ఆధునిక శస్త్రచికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ కోటేశ్వరరావు వివరించారు. బాధితుడి వయస్సు, నరాల గాయం తీవ్రత, ప్రమాదం జరిగినప్పటి నుంచి గడిచిన సమయాన్ని బట్టి తగిన చికిత్సను ఎంపిక చేస్తారని తెలిపారు. సకాలంలో శస్త్రచికిత్స, తదుపరి పునరావాస చికిత్స అందితే చేతికి తిరిగి కదలికలు, స్పర్శ మెరుగుపడటంతో పాటు బాధితులు తమ రోజువారీ పనులను స్వయంగా చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.**ప్రతి నెల రెండో బుధవారం ఓ శ్రీ హాస్పిటల్లో వైద్య సేవలు**బ్రేకియల్ ప్లెక్సస్ ఇంజురీపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు గుంటూరులో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్లోని యశోద హాస్పిటల్, హైటెక్ సిటీ బ్రాంచ్లో ప్లాస్టిక్ అండ్ రీకన్స్ట్రక్టివ్ సర్జన్గా సేవలందిస్తున్న తాను ఈ కార్యక్రమంలో పాల్గొని బాధితులకు అవసరమైన వైద్య సూచనలు అందించనున్నట్లు పేర్కొన్నారు.గుంటూరు డొంక రోడ్డులోని శ్రీ హాస్పిటల్లో ప్రతి నెల రెండో బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటానని తెలిపారు. చేతి నరాలు దెబ్బతిని ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులు ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్ ఏపీ మార్కెటింగ్ మేనేజర్ కె. చంద్రశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ ఖాసింవలి తదితరులు పాల్గొన్నారు.

# అబుల్ కలాం ఆజాద్ ఆశయాల సాధన దిశగా వైవీయూ: వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్

**కడప, నవంబర్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :**విద్యారంగంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశించిన ఫలితాలు సాధించే దిశగా యోగి వేమన విశ్వవిద్యాలయం ముందుకు సాగుతోందని ఉపకులపతి ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ అన్నారు. ఆజాద్ జయంతిని పురస్కరించుకుని వైవీయూలో పీఎం-ఉషా, మైనారిటీ సెల్, ఉర్దూ విభాగం సంయుక్తంగా 'విద్యావంతులుగా ఉండటం అంటే ఏమిటి?' అనే అంశంపై సదస్సు నిర్వహించాయి.ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం అమలుతో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ వాసుకి బెలవాడి కీలకోపన్యాసం చేస్తూ విద్య అంటే కేవలం డిగ్రీలు పొందడం కాదని, విమర్శనాత్మక ఆలోచన, శాస్త్రీయ దృక్పథం, నైతిక విలువలు, సామాజిక బాధ్యత కలిగి ఉండటమని వివరించారు.వైవీయూ రెక్టార్ ప్రొఫెసర్ ఎ.జి. దాము మాట్లాడుతూ విద్య వ్యక్తిత్వ నిర్మాణం, సామాజిక చైతన్యం, జాతీయ ప్రగతికి పునాదిగా నిలవాలని అన్నారు.



వివిధ పోటీల్లో విజేతలకు అతిథులు సర్టిఫికెట్లు అందజేశారు.కార్యక్రమానికి ప్రొఫెసర్ టి. చంద్రశేఖర్ సమన్వయకర్తగా, ప్రొఫెసర్ కె. రియాజున్నిసా కన్వీనర్గా వ్యవహరించారు. ఉర్దూ విభాగం అధ్యాపకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.